

బ్లాక్..మనీ!

నల్లధనానికి.. మద్యమే మార్గంగా..



ఎక్కడైనా ఓకే అక్కడ మాత్రం షాకే.. ఫోన్ పే.. గూగుల్ పే అంటే కుదరదు.. మనీ ఇవ్వాల్సిందే మందు తీసుకోవాల్సిందే.. ఇదీ బ్రాందీ షాపుల్లో పరిస్థితి.. డిజిటల్ లావాదేవీలపై ప్రభుత్వం ఆది నుంచి శ్రద్ధ చూపడం లేదు.. నేటికీ అదే విధానం కొనసాగుతోంది.. కేంద్రం హెచ్చరించినా ప్రభుత్వ తీరులో మాత్రం మార్పు లేదు.. క్యాష్ కొట్టు.. బాటిల్ పట్టు.. అనే విధానమే ఉంది.. అయితే ప్రస్తుతం ఎన్నికల ఏడాది కావడంతో ఈ బ్లాక్ మనీ ఏ విధంగా వినియోగిస్తారోనని మేధావులు ఆందోళన చెందుతున్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

2019 ఎన్నికల ముందు రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక నిషేధం మాట దేవుడెరుగు మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వానికి లాభసాటి వనరుగా జగన్ మార్చేశారు. దేశానికి చేటు చేస్తున్న నల్లధనం పని పట్టేపనిలో కేంద్ర ప్రభుత్వం ఉంటే.. రాష్ట్ర పాలకులు అందుకు భిన్నంగా వ్యవహరించడం విస్మయం కలిగిస్తోంది. నల్లధనాన్ని పరోక్షంగా ప్రోత్సహించే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తోందనే విషయం జగమెరిగిన సత్యం. డబ్బు మూటలకే ప్రాధాన్యం ఇస్తూ మద్యం షాపుల్లో డిజిటల్ పేమెంట్లను జగన్ సర్కారు కావాలనే పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.దీంతో డిజిటల్ పేమెంట్ల తంతు అంతంతమాత్రంగా సాగుతోంది.మద్యం అమ్మకాల ద్వారా వచ్చే కోట్లాది రూపాయలు నల్లధనం రూపంలో అవినీతి దందాలకు తరలిపోతుందంటూ ప్రతిపక్షాలు నాలుగేళ్ల నుంచీ గగ్గోలు పెడుతున్నా పాలకుల చెవికెక్కడంలేదు. ఎన్నికల వేళ ఈ నగదు ప్రజాస్వామ్యానికే ముప్పు తెచ్చే అవకాశం ఉందని ప్రజల్లో భయం వ్యక్తమవుతోంది.

కావాలనే కాలయాపన

మద్యం షాపులు, బార్ల ద్వారా వందల కోట్లలో నగదు లావాదేవీలు జరుగుతాయి. దీనిని సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు పట్టించుకోవడం లేదు. డిజిటల్ లావాదేవీలపై ప్రభుత్వం పెద్దగా శ్రద్ధ చూపకపోవడంతో నల్లధనానికి ఊతమిచ్చే విధానం నాలుగేళ్లుగా నడుస్తోంది. డిజిటల్ పేమెంట్ల విషయంలో కావాలని కాలయాపన చేస్తూ మొత్తానికి మళ్లీ ఎన్నికల వరకూ నెట్టుకొచ్చేశారు. వైసీపీ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో తొలుత పట్టణ ప్రాంతాల్లో తర్వాత గ్రామాల్లో అమలు చేస్తామని ప్రభుత్వం 2021 ఆగస్టులో ప్రకటించింది. మద్యం షాపుల్లో డిజిటల్ పేమెంట్లు తీసుకోవాలంటూ 2022 జూలైలో రాష్ట్ర సర్కారుకు కేంద్ర ప్రభుత్వం లేఖ రాసింది.దీంతో స్వీకరిస్తామంటూ 2022 నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. కానీ నెలలు గడిపేసింది. విజయవాడలో ప్రయోగాత్మకంగా 11 షాపుల్లో ప్రారంభిస్తామని 2023 ఫిబ్రవరిలో పేర్కొంది. ఏదో కంటి తుడుపుగా డిజిటల్ ప్రారంభించింది.

ఎన్నికల వేళ ప్రమాదం

మద్యం అమ్మకాలను ప్రభుత్వం ప్రధాన ఆదాయ వనరుగా మార్చేసుకుంది.గతంలో రూ.60కి దొరికే చీప్ లిక్కర్ ఇప్పుడు రూ.150కి చేరింది. రూ.120కి దొరికే క్వార్టరు రూ.230.. బీరు ఏకంగా రూ.330 అయిపోయింది. ఎక్కువగా అమ్ముడయ్యే మద్యంపై ఇటీవల మరోసారి సర్కారు రేట్లు బాదేసింది. దీంతో ప్రభుత్వ గల్లాపెట్టెకు మద్యం ద్వారా గతంలో ఎన్నడూ లేనంతగా ఆదాయం సమకూరుతోంది.దీనిలో 99 శాతం నగదు లావాదేవీలే ఉంటాయి. అదనంగా వసూలు చేస్తున్న డబ్బులు, నగదు లావాదేవీల ద్వారా దారి మళ్లించిన సొమ్ము ఎన్నికల 'ఖర్చు'లకు జాగ్రత్త చేసుకుంటున్నారని సమాచారం. వైసీపీ

- క్యాష్ కొట్టు.. బాటిల్ పట్టు..
- మత్తులో డిజిటల్ పేమెంట్లు
- జనవరిలో కేవలం 0.26శాతమే
- వందల కోట్లలో నగదు లావాదేవీలు
- డిజిటల్‌పై కేంద్రం ప్రోత్సాహం
- డబ్బు మూటలకే రాష్ట్రం ప్రాధాన్యం
- 'ఖర్చు'లకు ఇదే ప్రధాన మార్గం!
- ఎన్నికల వేళ ఇదో విసిత్రం

నాయకులు ఎంత వెచ్చించైనా ఓట్ల కొనుగోలుకు దిగే ప్రమాదం ఉందని ప్రజాస్వామ్యవాదులు భయాం దోళన

జిల్లాలో 0.26 శాతం



జిల్లాలో మొత్తం 145 ప్రభుత్వ మద్యం షాపులు, 25 బార్ల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ మద్యం షాపుల్లో ఇన్నేళ్లుగా డిజిటల్ పేమెంట్ల ఊసులేదు. గతేడాది మే నెలలో ఈ విధానాన్ని తీసు కొచ్చారు. ప్రభుత్వ మద్యం షాపులకు స్వైపింగ్ మిషన్లు, స్కానింగ్ స్టిక్కర్లు అందజేశారు.25 శాతం ఎస్‌బీఐ ద్వారా, 75 శాతం షాపులకు పేటీఎం ద్వారా డిజిటల్ పేమెంట్ల సదుపాయం కల్పించారు. కానీ చాలా షాపుల్లో డిజిటల్ పేమెంట్ల మిషన్లను మూలనపడేశారు. జనవరిలో అత్యధికంగా రూ.100 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. డిజిటల్ పేమెంట్లు జరిగింది మాత్రం కేవలం రూ.25 లక్షలే. బార్లలో ముందు నుంచీ డిజిటల్ పేమెంట్లు ఉన్నా యి. కానీ క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ.60-70 వసూ లు చేస్తున్నారు. బీరుపై రూ.100 వరకూ లాగేస్తున్నారు. నగదు లావాదేవీలు జరిగినవాటిలో ఈ అదనపు సొమ్ము లెక్కల్లోకి వెళుతుందో లేదో అనేది మాత్రం రహస్యం.

వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో వైసీపీ నాయకుల సొంత సరుకు ఏరులై పారుతుందనే చర్చ నడుస్తోంది.

సాంకేతికంగా వంక

డిజిటల్ పేమెంట్ల విషయంలో సాంకేతికంగా వంకలు చూపెడుతున్నారు. ఆన్‌లైన్ లేదా ఎలక్ట్రానిక్ వస్తువుల్లో సాంకేతిక లోపాలు తలెత్తడం సర్వసాధారణం. అయితే, మద్యం షాపులకు ఇచ్చిన స్వైపింగ్ మిషన్లలో సాంకేతిక లోపం వస్తే 'మంచే' జరిగిందనుకునే చందంగా పరిస్థితి ఉంది. ఎస్‌బీఐ, పేటీఎం గేట్‌వేల ద్వారా డిజిటల్ పేమెంటు విధానాన్ని కల్పించారు. దీనిలోనూ మెలిక పెట్టారు. పేటీఎం ద్వారా క్రెడిట్ కార్డులు పనిచేసేవికావు. ఎవరైనా మందు సీసా కొనుగోలు చేస్తే దానిని స్కాన్ చేస్తారు. కంప్యూటర్ స్క్రీన్‌పై డిజిటల్, క్యాష్ ఆప్షన్లు వస్తాయి. డిజిటల్ అని కొట్టగానే పేమెంటు అవుతుంది. అమ్మకం అయినా ఆ సీసా నిల్వ సంఖ్య నుంచి తగ్గుతుంది. అయితే ఒక్కోసారి పేమెంటు పూర్తి కాకుండా 'అండర్ ప్రాసెస్' అని వస్తుండడం, అది చాలా సేపటి వరకూ క్లియర్ కాకపోవడం వంటి వాటి వల్ల ఇబ్బంది తలెత్తుతుందని చెబుతున్నారు. ఇదేదో పరిష్కారానికి సాధ్యం కాని విషయంగా వదిలేయడం గమనార్హం. ఇక షాపుల్లో సాయంత్రం సమయాల్లో ముందు నుంచీ డిజిటల్ పేమెంట్లను స్వీకరించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ వల్ల సమస్య ఏర్పడుతోంది. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ వినియోగించే విశిష్ట యాప్‌లోనూ లోపాలున్నాయన్నాయని చెబుతున్నారు.ఈ యాప్‌ను వైసీపీ ప్రభుత్వం వచ్చాక తీసుకొచ్చింది. ఈ యాప్‌తో అటు షాపుల వాళ్లు, ఇటు ఎక్సైజు సిబ్బంది మొదటి నుంచీ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

డిజిటల్ డీలా...



నెల	అమ్మకాలు(కోట్లలో)	డిజిటల్ పేమెంట్లు	శాతం
మే	90,28,38,030	1,40,78,260	1.55
జూన్	86,58,97,350	2,30,42,140	2.66
జూలై	85,18,40,630	3,21,95,180	3.77
ఆగస్టు	80,82,31,510	4,12,62,620	5.10
సెప్టెంబరు	76,60,28,980	4,47,86,540	5.52
అక్టోబరు	77,57,84,100	3,79,12,810	4.66
నవంబరు	75,37,36,230	3,81,44,470	4.82
డిసెంబరు	84,16,58,100	1,05,07,210	1.23
జనవరి	99,46,33,660	25,60,760	0.26



గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో అధికారులతో మంత్రి వేణు (ఫైల్)

మంత్రిగారూ.. ఇదేం తీరు!

- గుడ్ మార్నింగ్ పేరుతో ప్రచారం
- నాయకుల చుట్టూ అధికారులు
- గ్రామాలను గాలికొదిలేసిన వైనం
- ఎంపీడీవోలకే జనసమీకరణ బాధ్యత?

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 3: మంత్రి గారొస్తున్నారంటే మంది మార్బలం అంతా కలిసి రావాల్సిందే.అంగన్‌వాడీ కార్యకర్త నుంచి రెవెన్యూ సిబ్బంది వరకూ అంతా ఆయన వెనుక ఉండాల్సిందే.. ఇదేదో ప్రభుత్వ కార్యక్రమం అనుకునేరు కాదండోయ్ బాబూ.. ఇది మంత్రి గారి ప్రచార కార్యక్రమం.. రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌చార్జిగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను వైసీపీ అధిష్ఠానం ఎంపిక చేసిన విషయం విదితమే.దీనిలో భాగంగా గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం రూరల్ అంటూ ఒక ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆ కార్యక్రమం ఎక్కడ ఆరంభమైతే అక్కడ మందీ మార్బలం అంతా ఆయన వెనుకు ఉండాల్సిందే మరి.. ఒక్కరోజుతో పోయేది కాదు కదా ఆయన పర్యటించినంత కాలం ఆయన కూడా ఉండాల్సిందే మరి.. జన సమీకరణ బాధ్యతతో పాటు నిర్వహణ ఆయా ఎంపీడీవోలకు అప్పగించడంతో ప్రభుత్వం నుంచి నిధులు రాకున్నా పంచాయతీలకు సంబంధించిన ప్రజాధనంతోనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అధికారులు విధులను పక్కనపెట్టి మంత్రి, నాయకుల భజనతో సరిపెట్టుకుంటూ గ్రామాలను గాలికొదిలేశారు.దీంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఎవరితో చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉంది. ఆయనపర్యటించిన చోట ఉన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదేం పాలన..మంత్రిగారొచ్చారంటే సమస్యలు పరిష్కరించాలి కానీ కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయని వాపోతున్నారు.మంత్రి, అధికార పార్టీ నాయకుల ప్రచార కార్యక్రమాలకు ప్రజాధనం వెచ్చిస్తున్నారు. అయితే అదే గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు మాత్రం నిధుల్లేవంటూ చెప్పడం విశేషం.మండలంలోని 10 గ్రామాలు ప్రత్యేకాధికారుల పాలనలోనే ఉండడంతో రూరల్ మండలంలోనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కోడ్ వచ్చేవరకు ఇంతేగా!

ఒక వైపు మంత్రిగారితో పాటు, కలెక్టర్ కూడా ఆదేశించడంతో పలు కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని ఎన్నికల కోడ్ వచ్చే వరకు తమకు తప్పేటట్టు లేదని రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావు పరోక్షంగా చెబుతున్నారు. మరొక విషయం ఏమిటంటే శ్రీనివాసరావు కోనసీమ ప్రాంతంలోని అంబాజీపేట మండల రెగ్యులర్ ఎంపీడీవోగా ఉంటూ రూరల్ మండలంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.దీంతో మంత్రి కార్యక్రమాల నిర్వహణపై మరింత బాధ్యతగా ఉంటున్నారంటూపలువురు విమర్శిస్తున్నారు.

దళితులంతా ఏకం కావాలి 7



జనాగ్రహానికి సిద్ధం!





- బలవంతంగా 'సిద్ధం' చేశారు
- బెదిరింపులతో జనాల తరలింపు
- ప్రయాణికుల కస్సు బస్సు
- జగన్ సభతో తీవ్ర ఇబ్బందులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి)/రాజమహేంద్రవరం అర్బన్ : ఏలూరులోని జగన్ సభకు జిల్లాలోని వైసీపీ నాయకులు జనాలను బలవంతంగా 'సిద్ధం' చేశారు. వాళ్లను పంపించడానికి నానాతంటాలూ పడ్డారు. ముందు రోజు నుంచే వెతుకు లాటలో స్థానిక నాయకులు బిజీ అయ్యారు.ఎక్కువగా రోజువారీ/కూలి పనులు చేసుకునే వాళ్లపైనే దృష్టి సారించారు. దీని కోసం సచివాలయ సిబ్బందిని యథావిధిగా రంగంలోకి దించారు. కొన్ని సీట్లను యాచకులతో నింపారు. రాజమహేంద్రవరంలో ఎంపీ భరత్‌రామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సుల్లో కుర్రకారు, వృద్ధులు, చిన్నాచితకా పనులు చేసుకొనే వాళ్లే కనిపించారు. వాళ్లను ఉదయం 8 గంటలకే ఇళ్లకు వెళ్లి బలవంతంగా తీసుకొచ్చి బస్సులు ఎక్కించి ఎంపీ కార్యాలయానికి తీసుకొచ్చారు. 11 గంటల ప్రాంతంలో ఎంపీ భరత్, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, గుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు ఆర్భాటంగా జెండాలు ఊపి బస్సులను వదిలారు. అప్పటి వరకూ బస్సుల్లో తరలించిన వారికి కనీసం మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో చాలా ఇబ్బంది పడ్డారు. బస్సులకు వైసీపీ స్టిక్కర్లు అంటిస్తుండగా బస్సుల సిబ్బంది కొంత అసహనం వ్యక్తం చేశారు. స్కూల్ బస్సులు కాబట్టి ఎక్కువగా అంటించవద్దని అభ్యర్థించారు. వైసీపీ నాయకులు వినిపించుకోకుండా పాఠశాల బస్సులను వైసీపీ జెండాలతో ముంచేశారు. ఇంత తతంగం చేసినా ప్రజలు విముఖత చూపడంతో జనాల కంటే బస్సులో ఖాళీ సీట్లే ఎక్కువగా తరలి వెళ్లాయి. సీఎం జగన్మోహనరెడ్డి శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో నిర్వహించిన సిద్ధం సభకు జిల్లాలోని నాలుగు డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులను పెద్దసంఖ్యలో పంపించడంతో జిల్లాకు చెందిన ఆర్టీసీ ప్రయాణీకులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆస్పత్రులకు, అత్యవసర పనులపై, పుణ్యక్షేత్రాలకు వెళ్లిన వాళ్ళకు నరకం కనిపించింది. సీఎం సభకు జనాలను తరలించడానికి జిల్లా నుంచి 90కి పైగా ఆర్టీసీ బస్సులను అధికారులు ఆయా ప్రాంతాలకు పంపించారు. రాజమహేంద్రవరం డిపోతో పాటు గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి ఈ బస్సులన్నీ శుక్రవారం రాత్రే బయలుదేరి వెళ్లాయి. దీంతో చాలా రూట్లలో బస్సులకు కొరత ఏర్పడింది. బస్సులు అరకొరగా రాకపోకలు సాగించడంతో రాజమహేంద్రవరం బస్ కాంప్లెక్స్‌లో ప్రయాణీకులు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. బస్సులు లేవన్న విషయం తెలియక పిల్లా పాపలతో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చిన చాలా మంది ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పలేదు. రాజమహేంద్రవరం కాంప్లెక్స్ నుంచి కొవ్వూరు, నిడదవోలు, ఏలూరు వైపు వెళ్లే ప్రయాణీకులతోపాటు జంగారెడ్డిగూడెం, అమలాపురం, తుని, కాకినాడ రూట్లలోనూ బస్సు ప్రయాణీకులు అవస్థలు పడ్డారు. బస్ కాంప్లెక్స్‌లోని కంట్రోలర్లు బస్సు షెడ్యూళ్లను ఏదోలా మేనేజ్ చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆర్టీసీ అధికారులపై ప్రయాణీకుల నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయి. చాలా మంది ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించక తప్పలేదు. ఈ బస్సులన్నీ శనివారం రాత్రికి ఆయా డిపోలకు చేరుకుంటాయని, ఆదివారం యథావిధిగా తిరుగుతాయని ఆర్టీసీ అధికార వర్గాలు చెబుతున్నాయి. జగన్ సభ కోసం ఇంత ఇబ్బంది పెట్టాలా? అంటూ ఆగ్రహం వ్యక్తమైంది.

టిక్ టాక్ శ్రీను ఆత్మహత్య



కొవ్వూరు/తాళ్లపూడి, ఫిబ్రవరి 3 : ఒంటరి తనం భరించలేక ఒక వ్యక్తి కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జి పైనుంచి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన యడ్లపల్లి శ్రీనివాసు (45) అలియాస్ టిక్‌టాక్ శ్రీనుగా సుపరిచి తుడు. మృతుడు శ్రీనివాస్ సగ్గొండ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. అయితే టిక్‌టాక్ చేస్తూ మంచి పేరు సంపాదించాడు. జీవితం సాఫీగా సాగిపోతుండగా 8 సంవత్సరాల కిందట మృతుడి ఇద్దరు పిల్లలు పాముకాటుకు గురై రోజు విడిచి రోజు తేడాలో మృతిచెందారు. అనంతరం భార్య భర్తలిద్దరూ ఒక బాలికను దత్తత తీసుకున్నారు. ఏదో తేరుకుంటుండగా భార్య, తండ్రి ఏడాది కిందట చనిపోయారు.అప్పటి నుంచి మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు.ప్రస్తుతం తల్లి,దత్తత కుమార్తెతో కలిసి ఉంటున్నాడు. ఏం జరిగిందో ఏమో కానీ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జిపై బైక్ పార్క్ చేసి నదిలో దూకేశాడు. కొవ్వూరు ఇసుక ర్యాంపు పడవ కార్మికులు గమనించి శ్రీనివాస్‌ను నది నుంచి ఎరినమ్మ ఘాట్ ఇసుక ర్యాంపుకు తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి మేనల్లుడు పవన్‌కుమార్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్య

తుఫాన్‌తో నష్టం.. తేరుకోని రైతు

పెరవలి, ఫిబ్రవరి 3 : పంట నష్టం తట్టుకోలేక కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెరవలి మండలం ఖండవల్లికి చెందిన తుమ్మూరి వెంకటేశులు (35) కౌలు వ్యవసాయం 8 ఎకరాలు చేస్తున్నాడు. ఈ ఏడాది వరి, కూరగాయలు సాగు చేశాడు. అయితే తుఫాన్ కారణంగా 8 ఎకరాల్లో పంటను నష్టపోయాడు. దీంతో లక్షల్లో నష్టం వాటిల్లింది. దీంతో అప్పులపాలయ్యాడు. అప్పటి నుంచి కాస్త ముభావంగా ఉంటున్నాడు. తోటి రైతుల వద్ద బాధను వ్యక్తం చేసేవాడు.చివరకు అప్పులు తీర్చే మార్గం కానరాక శనివారం ఉదయం పొలానికి పురుగు మందు చల్లాలని చెప్పి వెళ్లాడు. కౌలుకు తీసుకున్న పొలంలోనే కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు.సమీపంలో రైతులు వెంకటేశులను గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతదేహానికి తణుకు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి యూకేజీ, నర్సరీ చదువుతున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని తోటి రైతులు డిమాండ్ చేశారు.

జిల్లాలో ముగిసిన ఆడుదాం ఆంధ్రా

9 నుంచి విశాఖలో రాష్ట్రస్థాయి పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 3 : ఆడుదాం ఆంధ్రా కీడల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలే అని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానంలో శనివారం జరిగిన ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి క్రీడల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఇది మంచి అవకాశం అన్నారు. ఫిబ్రవరి 9 నుంచి 13వ తేదీ వరకూ విశాఖపట్నంలో జరిగే పోటీల్లో పాల్గొని జిల్లాకు పతకాలు తేవాలని కోరారు. జిల్లాస్థాయిలో 27 బృందాలు విజేతలుగా నిలిచారు. జిల్లాస్థాయి విజేతలకు బహుమతులు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వాడపల్లిలో భక్తుల కిటకిట



ఆత్రేయపురం, ఫిబ్రవరి 3: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తజన సంద్రమైంది. వేకువజామునే స్వామి వారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని ఫలపుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రముఖుల కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.34.07 లక్షలు లభించినట్టు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



క్యూలైన్‌లో భక్తులు





పొగమంచు కమ్మేసింది..

ఆత్రేయపురం, ఫిబ్రవరి 3: పచ్చని కోనసీమలో శనివారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటల వరకూ మంచు దుప్పటి కప్పేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం రహదారులు అలాగే ఇళ్లపై దట్టమైన పొగమంచు కమ్మేసింది. అనంతరం మధ్యాహ్నం నుంచి భానుడు ఉగ్రరూపం దాల్చాడు.

గోపురాలు స్వర్ణమయం చేసేందుకు పరిశీలన





పరిశీలన చేస్తున్న దృశ్యం

అన్నవరం, ఫిబ్రవరి 3: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి ప్రధానాలయ విమాన గోపురం, ఇతర ఉపాలయాల గోపురాలను స్వర్ణమయం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత పాలకమండలి సమావేశంలో ఆమోదం పొంది కమిషనర్ అనుమతి కోసం ఈవో రామచంద్రమోహన్ లేఖ రాయడంతో శనివారం దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలసి విమానగోపురం, ఉపాలయాల గోపురాలను పరిశీలించారు. దీనికి సుమారు 12.5 కిలోల బంగారం అవసరమవుతుందని రూ.8 కోట్లు వ్యయం కాగలదని ప్రాథమిక అంచనా వేసినట్లు పరమేశ్వరప్ప పేర్కొన్నారు. అయితే గత కొలతల ఆధారంగా అంచనా వేశామని దేవదాయ శాఖ కార్యాలయంలో మరోసారి కొలతలపై లెక్కకట్టి స్పష్టమైన వ్యయం తెలుపుతామని అన్నారు. స్థపతి వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజబాబు తదితరులున్నారు. అనంతరం దేవదాయశాఖ స్థపతి ఈవో కార్యాలయంలో రామచంద్రమోహన్‌ను కలసి అంచనా వ్యయంపై చర్చించారు. దీనికయ్యే వ్యయం డోనార్ స్కీం ద్వారా పూర్తిచేయాలని ఈవో రామచంద్రమోహన్ ఆలోచన చేస్తున్నారు. సుమారు 12 ఏళ్ల క్రితం రామచంద్రమోహన్ ఈవోగా పనిచేసిన కాలంలో ఆలయ పునర్నిర్మాణం చేపట్టగా అప్పట్లో బంగారు తాపడం చేయాలనే ఉద్దేశంతో విమాన గోపురానికి గ్రానైట్ కాకుండా ఇటుకలతో నిర్మాణం చేపట్టారు. మళ్లీ ఆయన ఈవో బాధ్యతలలో ఉండడంతో విమానగోపురం బంగారం చేయించాలనే ప్రతిపాదన కార్యరూపం దాల్చేందుకు అడుగులు వడివడిగా పడుతున్నాయి.

దళితులంతా ఏకం కావాలి
జగన్‌ను గద్దె దింపాలి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా

టీడీపీ మాల సామాజిక సాధికారత సభలో వక్తల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 3: దళిత ద్రోహి జగన్‌ను గద్దె దింపాలని, ఇందుకు దళితులంతా ఏకమవ్వాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీడీపీ మాల సామాజిక సాధికారత సభలో వక్తలు పిలుపునిచ్చారు. దగా పడ్డ.. దళితుడా.. నినాదంతో శనివారం కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీడీపీ మాల సామాజిక సాధికారత సభకు మహాసేన రాజేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు విచ్చేశారు. సభలో మాజీ ఎంపీ ఏపీ బుచ్చిమహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, కాకినాడ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, కోనసీమ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నారాయణరావు, నాయకులు గుమ్మడి వెంకటేశ్వరరావు, నక్కా సునీల్, మద్దాల చంటి, మొండి కమల ప్రసంగించారు. మహాసేన రాజేష్ మాట్లాడుతూ వైసీపీలో ఉన్న దళిత నాయకులందరూ దళిత ద్రోహులన్నారు. వైసీపీ ప్రభుత్వం దళితులను, కార్పొరేషన్లను విడగొట్టి పబ్బం గడుపుతుందన్నారు. ఒకప్పుడు దళితులు కార్పొరేషన్ ద్వారా విదేశీ విద్య, స్వయం ఉపాధి పథకాలు ద్వారా తోడ్పాటు అందించిన ఘనత చంద్రబాబునాయుడుదన్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన వారిని అరెస్టు చేయాలని మన తరఫున ఆందోళన చేపట్టిన వనమాడి కొండబాబుకు అండగా ఉండాలన్నారు. ఎవరైనా మనజోలికి వస్తే ఊరికే పంపించవద్దని, వారికి తగిన రీతిలో సారె పెట్టి పంపించాలన్నారు. కాకినాడలో ఈ సభ జరగకుండా చేయాలని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి అన్ని విధాలా ఆటంకాలు కల్పించాడని, సభకు వెళ్లితే సంక్షేమ పథకాలు పోతాయని దళితులను బెదిరించాడన్నారు. వైసీపీ నాయకుల కేసులకు, వలంటీర్ల బెదిరింపులకు భయపడకుండా సభకు తరలివచ్చిన మాలలను చంద్రశేఖరరెడ్డి చూసుకోవాలని రాజేష్ సవాల్ చేశారు. ఇదే పరిస్థితి చంద్రశేఖరరెడ్డికి ఉంటే ఇంటి లోంచి గుమ్మం దాటడని, మావాళ్లు గుమ్మాలు దాటి, ఊళ్లు దాటి సభకు తరలి వచ్చారన్నారు. తన మీద ఇప్పటికే 30 కేసులు పెట్టించారని అన్నారు. ద్వారంపూడి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, దళితుల ఓట్ల ద్వారానే ద్వారంపూడికి బుద్ధి చెబుతామన్నారు. గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, జగన్‌రెడ్డి రద్దు చేసిన 27 దళితుల సంక్షేమ పథకాలు మళ్లీ అమలు చేయడం తథ్యమన్నారు. మోకా ఆనందసాగర్ మాట్లాడుతూ దళిత కార్పొరేషన్‌ను ముక్కలు చేసిన ఘనత జగన్మోహనరెడ్డికి దక్కుతుందన్నారు. గత నాలుగున్నరేళ్లలో 2,700 మంది దళితులపై దాడులు జరిగినా ఒక్కరికి కూడా శిక్ష పడలేదన్నారు. ఇంత అన్యాయం దళితులకు జరిగినా ఇంకా వైసీపీ ప్రభుత్వానికి కొంతమంది దళితద్రోహులు భజన చేస్తున్నారన్నారు. కాశి నవీన్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక అనేక మంది దళితులు అక్రమంగా శిక్షింపబడ్డారన్నారు. నక్కా సునీల్ మాట్లాడుతూ వైసీపీ దళిత ద్రోహి పార్టీ అన్నారు. దళితులకు రాజకీయాల్లోను, ఉన్నత విద్యలోను అవకాశం కల్పించిన ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, దళిత యువకులతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. యువకుల నినాదాలతో ప్రాంగణం మారుమోగింది. దళిత నాయకులు బత్తుల సాయి, సీకోటి అప్పలకొండ పాల్గొన్నారు.

దళితులకు ద్రోహం చేసిన జగన్‌ను
దించేస్తున్నాం

అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

దళిత సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 3: దళితులకు ద్రోహం చేసిన సీఎం జగన్‌ను దించేయబోతున్నామని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శనివారం దళిత సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో జగన్ దళితులను అణగదొక్కాడని, దళితులకు జరిగిన అన్యాయాన్ని వివరించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించేందుకే ఈనెల 11న రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో దళిత సింహగర్జన సభ నిర్వహిస్తున్నామన్నారు. దళితులకు అన్యాయం జరుగుతుంటే వైసీపీలో మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా ఉన్న దళితులు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో దళితులకు మేలు చేసే 27 పథకాలను రద్దుచేస్తే అడిగేవాడు లేడని, నవరత్నాల్లో అమ్మఒడి పథకంలో అందరికీ వేసే డబ్బులు జనరల్ ఫండ్స్ నుంచి కేటాయించి, దళితులకు మాత్రం సబ్‌ప్లాన్ నుంచి ఎందుకు కేటాయించారని హర్షకుమార్ ప్రశ్నించారు. ఎస్సీ వసతి గృహాల్లో దుర్మార్గ పరిస్థితులు ఉన్నాయని, స్టడీ సెంటర్లు నిర్వీర్యం చేశాడని, ఇక యూనివర్సిటీల్లో వీసీలంతా జగన్ కులస్తులేనని అన్నారు. డాక్టర్ సుధాకర్, కిరణ్‌కుమార్, దొమ్మేరులో బొంత మహేంద్ర, సామర్లకోటలో గిరిబాబు, ఎర్రగొండలో మోజెష్, కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యంను పొట్టన పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. హత్యచేసిన ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ వస్తుంది కాని దళితుడైన కోడికత్తి శ్రీనివాస్‌కు బెయిల్ రాదు అని అన్నారు. కోడికత్తి శ్రీను బెయిల్ విషయంలో రాష్ట్ర గవర్నర్ స్పందించాలన్నారు. తెలంగాణంలో కేసీఆర్ ఎటువంటి అహంకారంతో ఉన్నాడో అదే రీతిలో జగన్ ఉన్నాడని, అక్కడ కేసీఆర్‌కు పట్టిన గతే ఇక్కడ జగన్‌కు పడుతుందని హర్షకుమార్ అన్నారు. సమావేశంలో హర్షకుమార్ తనయుడు జీవి శ్రీరాజ్, ఎర్రా రామకృష్ణ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

6న చలో అసెంబ్లీని జయప్రదం చేయాలి

ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు శాంతకుమారి

అంబాజీపేట, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 6వ తేదీన నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రజా ప్రతినిధులంతా జయప్రదం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి, కార్యదర్శి రంబాల రమేష్ కోరారు. సర్పంచ్‌ల 16 డిమాండ్లకు పరిష్కారం చూపాలని 6వ తేదీన అసెంబ్లీని ముట్టడించనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సంఘ నిధులు వైసీపీ ప్రభుత్వం కాజేసిందని వెంటనే తిరిగి సర్పంచ్‌ల ఖాతాలకు జమచేయాలన్నారు. అలాగే సర్పంచ్, ఎంపీటీసీలకు రూ. 15 వేలు గౌరవ వేతనం, ఎంపీపీ, జడ్పీటీసీలకు రూ.30 వేలు వంతున గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమానికి జిల్లాలోని సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రామాలయ నిర్మాణం ప్రభుత్వ విజయమనడం సరికాదు

మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్



మాట్లాడుతున్న ఉండవల్లి అరుణకుమార్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): 'గుడి కట్టినా, మసీద్ కట్టినా, చర్చి కట్టినా అది మతానికి సంబంధించినది. దానికి ప్రభుత్వం సహాయం చేస్తే చేయవచ్చు. కానీ రామాలయం కట్టడం ప్రభుత్వ విజయమని కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము ప్రకటించడం సరికాదు' అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ అన్నారు. రాజ మహేంద్రవరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ముస్లిం దేశాలన్నీ సెక్యులర్ దేశాలుగా మారుతున్నాయన్నారు. దుబాయి వంటి దేశాల్లో గుళ్లు కడుతున్నారని ఆయన అన్నారు. ఇప్పటికే దేశంలో సగానికి పైగా అంటే సుమారు 81 కోట్ల మందికి ఉచిత బియ్యం ఇస్తున్నారని మరి దేశంలో పేదరికం పోయినట్లు ఎలా అనుకుంటామన్నారు. ప్రపంచ స్థాయి సర్వే సంస్థ ఒకటి ఇటీవల మిస్ ఇన్‌ఫర్మేషన్ అండ్ డిస్ ఇన్ఫర్మేషన్(పుకారులు, అబద్ధాలు) ఇవ్వడంలో భారతదేశం నెంబర్ 1గా ఉందని తేల్చారని ఆయన వివరించారు. ఇవాళ అందరిదీ జై శ్రీరామ్ అనే నినాదమైపోయిందని వాస్తవానికి హిందూమతమే సెక్యులర్ మతమన్నారు. ఇక బీజేపీ యాంటీ ముస్లిం వాతావరణాన్ని తీసుకొస్తోందని ఆయన అన్నారు. దేశంలో మోదీకి 38 శాతం మద్దతు ఉంటే వ్యతిరేకించే వారు 50 శాతం ఉన్నారన్నారు. వాళ్లంతా కలవాలని ఉండవల్లి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్తర భారతదేశంలో జనాభా పెరిగిపోయిందని, దక్షిణ భారతంలో కుటుంబ నియంత్రణ వల్ల జనాభా కంట్రోలులో ఉందని అన్నారు. లోక్‌సభ స్థానాలు పునర్విభజన జరిగితే 800 వరకూ ఎంపీ స్థానాలు ఉంటాయని ఉత్తర భారతంలో ఎక్కువ ఎంపీ స్థానాలు పెరుగుతాయన్నారు. పన్నుల ఆదాయం మనకంటే ఉత్తరాది రాష్ట్రాలకే ఎక్కువ వెళుతుందన్నారు. అందుకే తమిళనాడు మంత్రి ఒకరు దక్షిణ భారతదేశం ప్రత్యేక దేశంగా విడిపోయే పరిస్థితులు వస్తున్నాయని అంటే, ఆయన మీద కేంద్రం విరుచుకుపడిందన్నారు. అర్బన్ ఏరియాలో బహిరంగంగా జగన్‌ను వ్యతిరేకిస్తున్నారని, జగన్ ఎన్ని తప్పులు చేయగలడో అన్ని తప్పులు చేశాడని ఉండవల్లి అన్నారు. చంద్రబాబు, పవన్ కలవడం వల్ల వైసీపీ వణికిపోవాలని, కానీ 40శాతం మందికి ఉచిత పథకాలు ఇచ్చానని, తానే నెగ్గేస్తానని జగన్ భావిస్తున్నాడన్నారు. అయితే చంద్రబాబు అతని కంటే ఎక్కువ పథకాలు ప్రకటించారని దీనిపై చర్చ జరగాలని అన్నారు. కాంగ్రెస్ బలపడాల్సిన అవసరం ఉందని షర్మిల వల్ల బలం పెరగవచ్చునన్నారు. కాంగ్రెస్ పెరిగితేనే కేంద్రంలో బీజేపీని ప్రశ్నించే వీలుంటుందన్నారు.

మెర్లపాలెం సరిహద్దులో ఇసుక తవ్వకాలు

సర్పంచ్ ఫిర్యాదుతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల విచారణ



మెర్లపాలెం సరిహద్దులో తవ్వకాలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 3: ఇసుక తవ్వకాలకు అనుమతులు పొందిన కంపెనీ సరిహద్దులు దాటి ఇసుకను అక్రమంగా తరలించి సుమారు రూ.20 కోట్లు ప్రజాధానాన్ని అక్రమార్కులు లూటీచేశారని మెర్లపాలెం సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో శనివారం సాయంత్రం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం ఇసుక తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలించి విచారణ నిర్వహించారు. రావులపాలెం మండలం ఉబలంక పరిధిలో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ ఇసుక తవ్వకాలకు అనుమతులు పొందింది. ఈ సంస్థ సరిహద్దులు దాటి మెర్లపాలెం సమీపంలో అనధికారకంగా బాటలు వేసి ఇసుక తవ్వకాలు నిర్వహించారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకూ సుమారు రూ.20 కోట్ల మేర ఇసుక తరలించుకుపోయారు. ఈ మేరకు జనవరి 18న సర్పంచ్ రాము సెబ్, మైనింగ్ అధికారులకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇసుక కమిటీ ఛైర్మన్ కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అలాగే సమీప ప్రాంతంలోని లంకలను కొల్లగొట్టి నిత్యం వందల లారీలతో బొండుమట్టిని తరలించుకుని కోట్లాది రూపాయలు అక్రమార్కులు దోపిడీకి పాల్పడుతున్నారంటూ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పురస్కరించుకుని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు కొత్తపేట సీఐ(సెబ్) డిసురేఖ అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని సర్పంచ్, వీఆర్వోలతో కలిసి పరిశీలించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న ఇసుక, బొండు మట్టి తవ్వకాలను నియంత్రించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

కడియం, ఫిబ్రవరి 3: జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ కె.శ్రీనివాసులు పర్యవేక్షణలో శనివారం తెల్లవారుజామున కడియం మండలం మురమండ గ్రామశివారు ముత్యాలమ్మ ఆలయం దాటిన తర్వాత మట్టిరోడ్డు నందు కొంత మంది పేకాడుతున్నారని తమకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ శనివారం కడియం పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. మురమండ ప్రాంతంలో పేకాడుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు ఆ ప్రదేశానికి వెళ్లగా అక్కడ పేకాడుతున్న ముగ్గురిని పట్టుకున్నామన్నారు. ఐదుగురు పరారయ్యారు. పట్టుకున్నవారు ఆర్గనైజర్లుగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. అరెస్టు చేసిన ముగ్గురు వ్యక్తుల నుంచి రూ. 5,880 నగదు, 3 సెల్‌ఫోన్లు, 2 మోటారుసైకిళ్లు, స్విఫ్ట్ డిజైర్ కారు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 3: కాకినాడ బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం ఎదురుగా గల పిండాల చెరువులో సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానిక టూటౌన్ పోలీసులు గుర్తించారు. శరీరంపై ఆకుపచ్చ రంగు చీర, ఎరుపు రంగు జాకెట్ ఉన్నాయని, ముఖాన్ని చేపలు కొరకడం వల్ల కొద్దిగా పాడైపోయిందన్నారు. మృతదేహాన్ని పరిశీలిస్తే చనిపోయి 48 గంటలు అయి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం టూటౌన్ పోలీసులను 9440796541, 9701626505 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 3: ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ పోలీసులు తెలిపారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఆవుల పుల్లారావు, కనకేశ్వరరావు అన్నదమ్ములు. గ్రామస్థులతో కలిసి శనివారం మోటారుసైకిళ్లపై కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి ఏడువారాల వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా బొబ్బర్లంక దాటిన తర్వాత కొవ్వూరు మండలం మద్దూరు లంక గ్రామ సమీపంలో యాక్టివా.. మోటారుసైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ బైక్ పైనుంచి కింద పడిపోయారు. కనకేశ్వరరావు(27) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు పుల్లారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. కాగా కనకేశ్వరరావుకు భార్య, 3 నెలల కుమార్తె ఉన్నారు.

మూగజీవాలపై వింత జంతువు దాడి

పెద్దాపురం, ఫిబ్రవరి 3: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని కాండ్రకోట గ్రామంలో మూగజీవాలపై వింత జంతువు దాడి చేస్తోందని గ్రామానికి చెందిన పలువురు వాపోతున్నారు. స్థానిక పీహెచ్‌సీ సమీపంలో నివసిస్తున్న షేక్ బాషా మేకను వింత జంతువు తినేసిందని స్థానికులు గుర్తించారు. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇది అసలు వింత జంతువు పనా లేక ఎవరైనా కావాలని చేస్తున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. గత వారం రోజుల కిందట గ్రామంలో క్షుద్రపూజలు కలకలం రేగడంతో ప్రజలు మరింత భయాందోళన చెందుతున్నారు.

భార్యకు శిరోముండనం కేసులో వ్యక్తికి రిమాండ్

సీతానగరం,ఫిబ్రవరి 3: భార్యకు శిరోముండనం చేసిన నేరంపై నిందితుడు కర్రి రాంబాబు అలియాస్ అభిరామ్‌ను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ కోరుకొండ ఎ.నాగమురళి తెలిపారు. విలేకరులకు తెలిపిన వివరాల మేరకు.. భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్థలు కారణంగా అభిరామ్ భార్యను చంపాలనుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్యను కత్తి సహాయంతో బెదిరించి ట్రిమ్మర్ సహాయంతో గుండు గీసి చంపడానికి ప్రయత్నించగా చుట్టుపక్కల వారి సమాచారంతో బాధితురాలు ఆశ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీతానగరం ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారని నిందితుడిని శనివారం అరెస్టుచేసి రాజమహేంద్రవరం 7వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

వెబ్‌సైట్‌లో సెలక్షన్ జాబితాలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 3: రాజమహేంద్రవరం జోన్-2 ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుల పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీ / సీహెచ్‌వో పోస్టుల ఫైనల్ సెలక్షన్ జాబితాలు జోన్ పరిధిలోని అన్ని జిల్లాల వెబ్‌సైట్లలో ఉంచినట్లు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య సంచాలకులు డాక్టర్ పి.పద్మాశశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయడానికి జనవరి 12న నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. ఎంపికైన అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని ఈనెల 5వ తేదీన ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని ప్రాంతీయ వైద్య, ఆరోగ్య సంచాలకుల కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

గండేపల్లి, ఫిబ్రవరి 3: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామంలో శుక్రవారం రాత్రి ఒకే రోజు సాగునీటి బోర్లు వద్ద ఉన్న 5 ట్రాన్స్‌ఫార్మర్‌లను చోరీ చేసి ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగివైరును దొంగలించి ఖాళీ ట్రాన్స్‌ఫార్మర్‌లు పడేసి వెళ్లిపోయారు. గండేపల్లి నుంచి సీతారాంపురం వెళ్లే రోడ్డులో ఉన్న పొలాల వద్ద సాగునీటి బోరులు వద్ద ఈ చోరీలు జరిగినట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి నిఘా పెట్టి తక్షణం నిందితులను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆర్‌బీ పట్నంలోనూ అపహరణ

పెద్దాపురం, ఫిబ్రవరి 3: మండలంలోని ఆర్‌బీ పట్నం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. గడిచిన 3 నెలల వ్యవధిలో గ్రామానికి చెందిన కంటిపూడి రామ్మూర్తి అనే రైతు పొలంలో 2 సార్లు చోరీ జరిగినట్లు రైతులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న రాగి తీగలను దొంగలు చోరీ చేస్తున్నారని, ఈ విషయంపై పోలీసులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

శృంగార వల్లభస్వామి ఆలయంలో
భక్తుల రద్దీ



పెద్దాపురం, ఫిబ్రవరి 3: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 1,88,570 అన్నదాన విరాళాలు రూ.62,285 ఆదాయం, కేశఖండన ద్వారా 2800 వెరసి రూ.3,02,286 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో పులి నారాయణమూర్తి తెలిపారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.

దంత వైద్య విధానంలో ప్రోస్టాడాంటిక్ మైలురాయి

ఐపీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సురేష్ సజ్జన్

రాజానగరం, ఫిబ్రవరి 3 : ప్రస్తుత కాలంలో దంతవైద్య విధానంలో ప్రోస్టాడాంటిక్ (కృత్రిమ దంత వైద్య) విధానం ఒక మైలురాయిగా నిలుస్తుందని ఐపీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సురేష్ సజ్జన్ అన్నారు. ఇండియన్ ప్రోస్టాడాంటిక్ సొసైటీ ఏపీ శాఖ ఆధ్వర్యంలో రాజానగరం లోని కెఎల్ఆర్ లెనోరా దంతవైద్య కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న 10వ రాష్ట్ర సదస్సు శనివారంతో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఐపీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సురేష్ సజ్జన్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రోస్టాడాంటిక్ సొసైటీలో 10వ రాష్ట్ర సదస్సు ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. దంత వైద్యులు రెండు రోజులు పాటు జరిగిన ఈ సదస్సును దంత వైద్య విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సు ఛైర్మన్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ తమ కళాశాలలో గత రెండు రోజులుగా జరిగిన ఈ సదస్సులో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 215 వైద్య నిపుణులు, పీజీ విద్యార్థులు హాజరై వివిధ ప్రజెంటేషన్లు అందించగా వాటిలో 14 ప్రజెంటేషన్లు ఎంపికైనట్లుగా చెప్పారు. వీనిలో ఉత్తమ సైంటిఫిక్ పేపర్లు ప్రజెంట్ చేసిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ శేషారెడ్డి, లెనోరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ నాగార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వప్రకాష్‌శెట్టి, కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ టీఎస్‌వీ సత్యనారాయణ, సైంటిఫిక్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ కొండక, హెచ్‌ఓడీలు, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

● మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి

రంపచోడవరం, ఫిబ్రవరి 3: ముఖ్యమంత్రి జగన్ ప్రకటించింది మెగా డీఎస్సీ కాదని దగా డీఎస్సీ అని రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ ఖాళీలుంటే కేవలం 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను వంచించడమేనని మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి ధ్వజమెత్తారు. శనివారం రంపచోడవరంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జగన్ ప్రతి సంవత్సరం జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ఏటా మెగా డీఎస్సీ, 2.32లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని మాటిచ్చి పదవి చేపట్టి నాలుగున్నరేళ్లయినా మాట నిలబెట్టుకోలేదన్నారు. గంజాయి ఉత్పత్తిలో రాష్ట్రాన్ని గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్యావ్యవస్థతో జగన్‌రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.

'ఉద్యోగ, ఉపాధ్యాయ బకాయిలు చెల్లించాలి'


పాడేరు ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రంపచోడవరం, ఫిబ్రవరి 3: ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాల బకాయిలు తక్షణమే చెల్లించాలని యూటీఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం యూటీఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్, ఆడిట్ కమిటీ మెంబర్లు, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో పాడేరు ఐటీడీఏ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా విల్సన్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు, డీఏ, ఏరియర్లు, సరెండర్ లీవులు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, 12వ పీఆర్ 30 శాతం ఐఆర్ చెల్లించాలన్నారు. 14 సంవత్సరాల పాటు పోరాడి అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయించుకున్నామని, ప్రభుత్వం నాలుగు సంవత్సరాల తర్వాత డీఎస్సీని ప్రకటిస్తూ తిరిగి అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశపెట్టడం సరికాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలం కావడంతోనే రిలే దీక్షలు చేపట్టాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు చిట్టిబాబు, చీకటి నాగేశ్వరరావు, దేముడు, జి.తేజరావు, కె.రఘునాథ్, కె.ఆంధ్రయ, రాఘవులు, శ్రీనివాస్, చిన్నిబాబు, కె.కృష్ణారెడ్డి, గంగరాజు, శెట్టి గంగాధర్, ప్రసాద్, నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడితో కొండ గొర్రె మృతి



మోతుగూడెం, ఫిబ్రవరి3: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న దారాలమ్మ గుడి పిక్నిక్ స్పాట్ వద్ద శనివారం కొండ గొర్రె సీలేరు నది ఒడ్డున మంచి నీళ్లు తాగుతుండగా ఆ పక్కన ఉన్న వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి చంపేశాయి. పొల్లూరు నుంచి మోతుగూడెం వస్తుండగా ఒక వ్యక్తి మార్గమధ్యంలో ఈ సంఘటన చూసి ఫారెస్ట్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సమాచారం అందిన వెంటనే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాందాస్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని కొండ గొర్రెను గుర్తించారు.దీనిని అక్కడ నుంచి మోతుగూడెంలో పశువుల ఆస్పత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలోనే చనిపోయిందని వెటర్నరీ అసిస్టెంట్ బి.రమేష్ తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

రాజవొమ్మంగి ఫిబ్రవరి 3: మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లిమెట్ల కాలనీ గ్రామానికి చెందిన సీహెచ్ అప్పలనాయుడు, నెల్లిమెట్ల గ్రామానికి చెందిన దుర్గప్రసాద్ నెల్లిమెట్ల కాలనీ- దూసరపాము గ్రామాల మధ్యలో ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో గాయాలపాలైన ఇరువురిని స్థానికులు రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తరలించారు. వైద్యాధికారి నాగార్జున ప్రాథమిక వైద్యం అందించి అప్పలనాయుడును కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి, దుర్గాప్రసాద్‌ను ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ప్రమాదంలో అప్పలనాయుడు కాలికి తీవ్రగాయం కాగా, దుర్గ ప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

జనసేన పార్టీ సిద్ధాంతాలతో వివాహ ఆహ్వాన పత్రిక



రాజవొమ్మంగి ఫిబ్రవరి 3: పెళ్లికి పిలిచేందుకు ఆహ్వాన పత్రికలు ఇవ్వడం మామూలే, అయితే అదే ఆహ్వాన పత్రికపై జనసేన సిద్ధాంతాలను కూడా ముద్ర వేయించి ఆహ్వాన పత్రికలు పంచడం ప్రస్తుతం ఏజెన్సీలో చర్చనీయాంశమైంది. జడ్డంగి గ్రామానికి చెందిన గణజాల దుర్గ ప్రసాద్ అనే యువకుడికి లలిత తో ఈ నెల 18వ తేదీన పెళ్లి జరగనుంది. అయితే కాకినాడలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసే దుర్గాప్రసాద్ తన పెళ్లి శుభలేఖలపై జనసేన పార్టీ సిద్ధాంతాలు ముద్రించాడు. ఇలా చేస్తే ప్రజల్లోకి జనసేన సిద్ధాంతాలు వెళతాయని అనుకున్నాడు. ఈ పెళ్లి కార్డు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

అంగన్వాడీ భవనాలు ఏర్పాటు చేయాలి

దేవీపట్నం, ఫిబ్రవరి 3: దేవారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పోతవరం, చిన్నారిగండి, దేవారం గ్రామాలకు కొత్త అంగన్వాడీ కేంద్రాలు మంజూరు చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. దేవీపట్నం మండలంలోని దేవారం పంచాయతీ పరిధిలో పోతవరం గ్రామంలో శిథిలావస్థకు చేరిన అంగన్వాడీ భవనాలను శనివారం పరిశీలించారు. ఇప్పటికైనా స్పందించి కొత్త భవనాలు మంజూరు చేయాలన్నారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

రాజవొమ్మంగి ఫిబ్రవరి 3: మండలంలోని లాగరాయి, కింద్ర, తాళ్లపాలెం, ఎం.మర్రిపాలెం, బరదనాంపల్లి,రాజవొమ్మంగి, అనంతగిరి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ సహకరించాలని సీఐ సన్యాసి నాయుడు కోరారు. ఆయనతో రాజవొమ్మంగి ఎస్ఐ వెంకయ్య ఉన్నారు.

పీహెచ్‌సీకి వైద్య పరికరాల విరాళం

మోతుగూడెం, ఫిబ్రవరి 3: తులసిపాక పీహెచ్‌సీకి స్మారిటన్స్ ఫర్ ది నేషన్స్ స్వచ్ఛంద సంస్థ వైద్య పరికరాలను విరాళంగా శనివారం అందజేసింది. కార్యక్రమానికి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మారుమూల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి సీబీసీ మిషన్ ద్వారా హెచ్‌బీ టెస్ట్, ప్లేట్‌లెట్స్ కంట్, ఆర్బీసీ, డబ్ల్యూబీసీ, పీసీటీ, ఎంపీవీ, హెచ్‌సీటీ, లింఫోసైట్స్, మోనోసైట్స్ వంటి అనేక పరీక్షలు సీబీసీ ద్వారా చేసుకోవచ్చన్నారు. వైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ చంద్రయ్య, సూపర్‌వైజర్లు ముక్తేశ్వరరావు, గంగరాజు, స్టాఫ్‌నర్సు పాల్గొన్నారు.

'రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి'

వరరామచంద్రాపురం, జనవరి 3: మండలంలోని ఈ ఏడాది గోదావరి వరదలకు, భారీ వర్షాలకు అధ్వానంగా తయారైన రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని మండల సీపీఎం నాయకులు, ప్రజా ప్రజానిధులు ఐటీడీఏ పీఓ కావూరి చైతన్యకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం మండల సీపీఎం నాయకులు, ప్రజా ప్రతినిధులు చింతూరు ఐటీడీఏ పీవోను కలిశారు. ఈక్రమంలో మండలంలోని వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమయిన శ్రీరామగిరి గ్రామంలో మంచినీటి సమస్యలేకుండా శాశ్వత పరిష్కారం చేయాలని వారు కోరారు. స్పందించిన పీవో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచులు సూనెం సరోజిని, పులి సంతోష్ కుమార్ సవలం మారయ్య, కారం బుచ్చమ్మ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, నాయకులు వడ్లాది రమేష్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

నాణ్యత లేకుండా డ్రైనేజీ నిర్మాణం

రాజవొమ్మంగి ఫిబ్రవరి 3: రాజవొమ్మంగి గ్రామంలోని నూకాలమ్మ అలయ సమీపంలో జీజీఎంపీ నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులలో నాణ్యత కరువైందని టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు అన్నారు. సంబంధిత అధికారులు నిర్మాణ సమయంలో పర్యవేక్షణ చేయకపోవడంతో డ్రైనేజీ అడుగు భాగంలో ఆరుఅంగుళాలు వెడల్పు కాంక్రీట్ వేయాల్సి ఉండగా అంగుళం కూడా వేయట్లేదని అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

16 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 3: ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16,17,18 తేదీల్లో బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజి ంగ్ సెక్రటరీ డీవీవీ త్రినాథ్ తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 35 నుంచి 75 వయసున్న స్త్రీ, పురుషులు ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చుని, ఇందులో ఎంపికైన వారు మార్చినెలలో హరియాణాలో జరగబో యే టోర్నమెంటులో పాల్గొంటారని అన్నారు. పాల్గొనే క్రీడాకారులు ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు అనుశ్రీ సత్యనారాయణ, మద్దూరి శివశంకర్ పాల్గొన్నారు.

నిరుద్యోగులను మభ్యపెట్టేందుకే మెగా డీఎస్సీ

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి


మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 3: నిరుద్యోగ యువతను మభ్య పెట్టేందుకే మెగా డీఎస్సీ ప్రకటన చేశారని నిరుద్యోగుల ఇబ్బందులపట్ల వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తిలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 సార్వత్రిక ఎన్నికల ముందు జగన్‌రెడ్డి చెప్పిన అమూల్యమైన మాటలు నేడు ఏమయ్యాయన్నారు. ఎన్నికలకు ఆరునెలల ముందు చేసిన శంకుస్థాపనలు, ప్రకటనలు ఇస్తే అవి ఉత్తుత్తి ప్రకటనలన్న జగన్‌రెడ్డి నేడు చేసిందేమిటని ప్రశ్నించారు. అధికారం చేపట్టిన 57 నెలలకు మెగా డీఎస్సీ ప్రకటించడం దగా చేయడం కాదా అని ప్రశ్నించారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదు

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబును విమర్శించే స్థాయి అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి లేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కాతేరుసభలో పార్లమెంట్ పరిధిలో జరిగిన అవినీతిపై చంద్రబాబు ప్రసంగిస్తే ఎమ్మెల్యే భుజాలు తడుముకుంటున్నారని కనీసం వయస్సుకు కూడా గౌరవం ఇవ్వకుండా చంద్రబాబును నువ్వు అంటూ సంబోధించడం సరికాదన్నారు. గడచిన ఐదేళ్ల పాలనలో ఎమ్మెల్యే 500కోట్ల మేర అవినీ తికి పాల్పడ్డారని తాను చేసిన ఆరోపణకు నేటికీ కట్టుబడి ఉన్నానని బహిరంగ చర్చకు వస్తే ఆధారాలతో సహా నిరూపిస్తానని రామకృష్ణారెడ్డి సవా ల్ విసిరారు. తనపై వేసిన మూడు విజిలెన్స్ కమిటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, బాసి పాల్గొన్నారు.


తహసీల్దార్ హత్యపై మౌనం పాటిస్తున్న కలెక్టర్ మాధవీలత, తదితరులు

తహశీల్దార్ రమణయ్య హత్య ఘటనపై ఖండన

రాజమహేంద్రవరం రూరల్ ఫిబ్రవరి3: విశాఖ జిల్లా కొమ్మాదిలో విశాఖపట్నం రూరల్ తహశీల్దార్ రమణయ్య హత్యపై జిల్లా కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌లు తీవ్రంగా ఖండించినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు కలెక్టరేట్ ఆవరణలో శనివారం సాయంత్రం కలెక్టరేట్ కార్యాలయం అధికారులు రమణయ్య మృతిపై రెండు నిమిషాలు మౌనం పాటించి వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరశింహులు, జిల్లా రెవెన్యూ అసోషియేషన్ ప్రతినిధులు, తదిదరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పేరుతో వైసీపీ జగన్నాటకం

● రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నిరుద్యోగ యువతను మోసం చేయడానికి మరో మారు మెగా డీఎస్సీ పేరుతో వైసీపీ జగన్నాటకం ఆడుతోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగున్నరేళ్లలో నిరుద్యోగులకు ఎటువంటి చేయూత, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా వారికి తీవ్ర అన్యాయం చేసి ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ వారిని నమ్మించడానికి జగన్ కుట్రలు పన్నుతున్నారన్నారు. చంద్రబాబు రాష్ట్రా న్ని పెట్టుబడుల హబ్‌గా మారిస్తే జగన్ రౌడీయిజంతో రాష్ట్రం నుంచి పరిశ్రమలు, పారిశ్రామిక వేత్తలు పారిపోయేలా చేశారని మండిపడ్డారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పరిశ్రమలు తెచ్చారు, ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు.

నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 3: సీఎం జగన్ వదిలించి మెగా డీఎస్సీ కాదని దగా డీఎస్సీ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో 50,892 ఖాళీలుంటే 6100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను వంచించడమేనని, నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా చేసిన ఏటా మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఏమయ్యాయో జగన్ సమాధానం చెప్పాలన్నారు. దేశంలో నిరుద్యోగం 11శాతం వుంటే మన రాష్ట్రంలో 24శాతం ఉందని, యువతను జగన్ వంచించి రాష్ట్రాన్ని నిరుద్యోగాంధ్రప్రదేశ్‌గా మార్చాడని మండిపడ్డారు.

పూజిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

● వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 3: బాపట్ల జిల్లా వ్యవసాయశాఖ గ్రామ సహాయకులు పూజిత మృతి పట్ల వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం సంతాపం ప్రకటించింది. శనివారం రాజమహేంద్రవరంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజిత చిత్రపటానికి వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణుమాధవరావు, రాజమహేంద్రవరం సబ్ డివిజన్ వీఏఏ వీహెచ్ ఏ అసోసియేషన్ సభ్యులు దుర్గబాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం ఆత్మహత్య చేసుకున్న పూజిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ వేణుమాధరావుకు వారంతా వినతిపత్రం అందించారు. వేణుమాధవరావు మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకుల పని భారాన్ని తగ్గించాలని పూజిత ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఆందోళనకు వ్య వసాయ విస్తరణ అధికారుల సంఘం పూర్తి మద్దతును ప్రకటిస్తోందన్నారు. అనంతరం సహాయకులు అంతా రూరల్ వ్యవసాయ అధికారి భీమరాజుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రాష్ట్ర సంఘం ప్రచార కార్యదర్శి పీటర్, మాజీ జిల్లా అధ్యక్షుడు జీఎం శాంతకుమార్, సునీల్, వీఏఏ సంఘం సభ్యులు రాహుల్, నాగబాబు, సురేఖ, హేమంత్ , ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 29లోగా వ్యాపారులు కార్మిక శాఖ లైసెన్సు పొందాలి

● డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దుకాణదారులు తప్పనిసరిగా కార్మికశాఖ నుంచి లైసెన్సు పొందాల ని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. చాంబర్ ఆ ఫ్ కామర్స్, వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులతో ఆయన శనివారం సమా వేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలు, మోటారు రవాణా వాహన యాజమాన్యాలు, భవన తదితర నిర్మా ణ సంస్థలు, కాంట్రాక్టు కార్మికుల యజమాన్యాలు, ప్రిన్సిపల్ ఎంప్లాయ ర్లు, అంతర్రాష్ట్ర వలస కార్మికులను వినియోగించే వారు కార్మిక చట్టా ప్రకారం విధిగా ఈనెల 29లోపుగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలన్నారు. కార్మిక చట్టాలన్నిటికీ కలిపి ఒకే రిజిస్ట్రేషన్ పొందే అవకాశం ఉందని జిల్లా ఇన్చార్జి అధికారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్ఎం వలి తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషను పొందిన వారు తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలన్నారు. గడువు లోపుగా నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషను సర్టిఫికెట్ పొందని వాళ్లు చట్టప రమైన చర్యలకు బాధ్యులవుతారన్నారు. బాలబాలికలు బడిలో ఉండాలని.. పనిలో పెట్టుకోవడం, వెట్టిచాకిరీచేయించడం నేరమన్నారు. బాలకార్మికవ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యతనిగుర్తెరగాలన్నారు. ఇప్పటికే నిఘా పటిష్టంచేశామని పేర్కొన్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా దగా

● ఆమ్ ఆద్మీ నిరసన ధర్నాలో జిల్లా కన్వీనర్ యార్లగడ్డ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 3: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం దగా చేసిందని ఇప్పటికైనా పార్లమెంట్ సమావేశాల్లో హోదా ప్రకటించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ యార్లగడ్డ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరశిస్తూ రాజమహేంద్రవరం గోకవరం బస్టాం డ్ అంబేడ్కర్ విగ్రహంవద్ద శనివారం ఆమ్‌ఆద్మీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి పాదాల సాక్షిగా తిరుపతిలో బీజేపీ ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లోనైని స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆప్ నాయకులు లయన్ జానీరాయ్, సుమలత, కొవ్వూరు ఇన్‌చార్జి వై.వరప్రసాద్ పాల్గొన్నారు.

ఒప్పందాలు తెలియకుండా అసత్యప్రచారం

● కిమ్స్ బొల్లినేని డైరెక్టర్ స్వర్ణ రామ్మోహనరావు

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 3: ఏఈఎల్‌సీకి రిజిస్టర్ లీజు తీసుకున్న పులవర్తి విజయలక్ష్మికి సబ్ లీజుదారులైన కిమ్స్ ఆసుపత్రికి మధ్య జరిగిన ఒప్పందాలు తెలియకుండా కొందరు అవాస్తవాలు చెబుతున్నారని కిమ్స్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహనరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. షాడే గర్ల్స్ హైస్కూల్ క్యాంపస్‌లో ఉన్న స్థలంలో కిమ్స్ హాస్పిటల్ ప్రైవేట్ లిమిటెడ్ సబ్ లీజుతో నిర్మాణం పనులు చేస్తోందని, దీనిపై కొందరు స్వార్థపూరిత ప్రయోజనాలతో షాడే ఆస్తులు అన్యాక్రాంతమంటూ అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. వారిపై చట్టపరంగా చర్యలకు ముందుకువెళ్తామని చెప్పారు.

ఐఎస్‌టీఎస్‌కు అంతర్జాతీయ అవార్డు



పాండిచ్చేరి మాజీ గవర్నర్ కిరణ్‌బేడీ నుంచి అవార్డు అందుకుంటున్న ఐఎస్‌టీఎస్ కళాశాల చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

రాజానగరం, ఫిబ్రవరి 3 : మండ లంలో తూర్పుగోనగూడెంలోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఫర్ ఉమెన్ (ఐఎ స్‌టీఎస్) మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు ప్రతిష్టాత్మకమైన ఆసియా లీడర్స్ ఎక్సలెన్స్ అవార్డ్స 2024 లభించింది. ఈమేరకు ఇటీవల సింగపూర్‌లోని గ్రాండ్ కోఫ్‌ధార్స్ వాటర్ ఫ్రంట్‌లో జరిగిన సదస్సులో కళాశాల చైర్మన్ కళ్లెం ఉపేందర్‌రెడ్డి సంస్థ తరఫున పాండిచ్చేరి మాజీ గవర్నర్ కిరణ్ బేడీ నుంచి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తమ కళాశాల సిబ్బంది అంకిత భావంతో అహర్నిశలు అందించిన కృషి ఫలి తం గా తమ కళాశాలకు ఈ అరుదైన అవకాశం లభించిందన్నారు. ఆసియా టుడే మోస్ట్ ట్రస్టెడ్ ఇంజనీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్‌గా ప్రశంసించింద న్నా రు. ఐఎస్‌టీఎస్ తిరుగులేని నిబద్ధత వల్ల వివిధ దేశాలకు చెందిన సంస్థల అధిపతుల సమక్షంలో అవార్డు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

వినూత్నంగా శిలాఫలకానికి పూజలు


కొంకుదురులో శిలాఫలకానికి పూజలు చేస్తున్న రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఫిబ్రవరి 3: తూర్పుగోదావరిజిల్లా బిక్కవోలు మండలం కొంకుదురులో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి వేసిన శిలాఫలకానికి వినూత్నంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 డిసెంబరు 19న రూ. 4.72 కోట్లతో సీసీ డ్రెయిన్ నిర్మాణం కోసం ఈ శిలాఫలకం స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారన్నారు. అయితే 58 నెలలు పూర్తి కావస్తున్నా ఇంతవరకూ పనులకు మోక్షం కలుగలేదన్నారు. దీంతో ఆయన శిలాఫలకానికి పసుపు నీళ్లు, పాలతో అభిషేకం చేసి, మామిడితోరణాలు కట్టి, కొబ్బరి కాయలు కొట్టి హారతులు ఇచ్చారు. గ్రామంలో సీసీ రోడ్లు, బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు, ఈ పనులన్నీ ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. 2012లో దేవస్థానం భూముల కౌలుకు సంబంధించిన సొమ్ము ఇంతవరకూ దేవస్థానానికి ఎందుకు జమ చేయలేదని వీటన్నింటికీ ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. ఈయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, దేశం నేతలు సబ్బారపు సూర్యనారాయణ, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, అనుసూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతీ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థే'

కడియం, ఫిబ్రవరి 3: సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు రాజానగరం, రంగంపేట, అనపర్తి, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరంరూరల్, బిక్కవోలు మండలాలకు చెందిన గణితం, ఫిజికల్ సైన్సు, బయాలాజికల్ సైన్సు ఉపాధ్యాయులకు అనుసరణ శిక్షణ తరగతులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్నాయి. జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ కోఆర్డినేటర్ సుభాషిణి శిక్షణా తరగతులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు నిత్యం విద్యార్థులకు ఉపయోగపడే విషయాలు, బోధనలో వస్తున్న మార్పులను తెలుసుకుంటూ ఉండాలని మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఐఎఫ్‌బీ బోర్డులను, టాబ్స్, దీక్షాయాప్, ఈ- కంటెంట్ యాప్‌లో ఉంటున్న సమాచారాన్ని విద్యార్థులకు ఎలా వివరించాలో తెలిపారు. శిక్షణా తరగతులలో భాగంగా ఫిజికల్ సైన్సుకు సంబంధించి 90 మంది, లెక్కలకు 150మంది ఉపాధ్యాయులు శిక్షణ తీసుకున్నారని ఎంఈవో 2 నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమానికి ఆర్‌పీ గా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సురేఖ వ్యవహరించారు. హెచ్‌ఎం టి.సత్యనారాయణ, ఎంఈవో-1 లజపతిరాయ్‌లు పర్యవేక్షించారు.

'మస్‌జిద్ నిర్మాణాన్ని అడ్డుకోవడం దారుణం'

కడియం, ఫిబ్రవరి 3: కడియం మండలం పొట్టిలంక గ్రామంలో మస్‌జిద్ నిర్మాణాన్ని వైసీపీ నాయకులు అడ్డుకోవడం దారుణమని టీడీపీ నూర్‌భాషా, మైనారిటీ సాధికారిత సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం, మైనారిటీ నాయకులతో కలిసి మస్‌జిద్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సుభాన్ మాట్లాడుతూ గ్రామ కార్యదర్శి మస్‌జిద్ నిర్మాణాన్ని స్థానిక నాయకుల సహకారంతో అడ్డుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పలువురు మస్‌జిద్ నిర్మాణానికి సహకరిస్తున్నారని, గ్రామస్థుల సహకారం ఉందని, పిల్లర్ల వరకు తీసుకెళ్లామని ఇపుడు అర్థాంతరంగా మస్‌జిద్ నిర్మాణం అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారని అది జరిగితే, ఈ విషయాన్ని రాష్ట్రస్థాయికి తీసుకెళ్లి ఉద్యమానికి సిద్ధం అని, 'చలో పొట్టిలంక' కార్యక్రమానికి పిలుపునిస్తామని సుభాన్ హెచ్చరించారు. పొట్టిలంకలో మస్‌జిద్ ఏహజరత్ అభూబకర్ పేరుతో స్థానిక ముస్లిం కుటుంబాలు వక్ఫ్‌బోర్డు స్థలంలో మస్‌జిద్ నిర్మాణానికి పూనుకుంటే గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసులపై నోటీసులు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో కాతేరు, శాటిలైట్‌సిటీలలో ఇదేవిధంగా సమస్య ఎదురైతే రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సహకారం తీసుకున్నామన్నారు. ఆయన వెంట జనసేన మైనారిటీనాయకులు బాషా లిమ్రా, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఉమర్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అవసరం

● సర్టిఫికెట్ల ప్రధానోత్సవంలో కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 3: పిల్లల ఆరోగ్యం, ఆర్యోకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించడం చాలా అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నా రు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఆరోగ్యశాఖ ఆధ్వ ర్యంలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం జిల్లా కలెక్టరేట్‌లో నగదు బహుమతి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి గోపాలపురం అంబేడ్కర్ గురుకులం పదో తరగతి విద్యా ర్థిని ఎస్.అనూష, ద్వితీయ బహుమతి రాజమహేంద్రవరం ఎల్‌ఎంసీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని పి.అమృత, తృతీయబహుమతి రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ఇంగ్లిషు మీడియం స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని జీవీ కావ్య గెలుచుకున్నారు. అలాగే వక్తృత్వ, చిత్రలేఖనం, పోటీ ల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. కార్యక్రమం లో జిల్లా లెప్రసీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర, ఇతర వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చైతన్యలో ఐక్వెస్ట్ వేడుకలు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీఎస్పీ కిషోర్ కుమార్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మోరంపూడిలోని శ్రీచైతన్య స్కూల్‌లో సృజనాత్మక కళలపై జోనల్‌స్థాయి పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈస్ట్‌జోన్ డీఎస్పీ డాక్టర్ కిషోర్‌కుమార్ ముఖ్య అతిథిగా వచ్చేసి జ్యోతిప్రకాశనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల ప్రతిభను అన్ని విధాలుగా వెలికితీసే ప్రయత్నం చేస్తున్నా రంటూ శ్రీచైతన్య యాజమాన్యాన్ని అభినందించారు. చిత్రలేఖనం, క్విజ్, అబాకస్, సంగీతం, నృత్యం తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కాకినాడ, అమలాపురం, పాలకొల్లు, రాజమహేంద్రవరం నుంచి నర్సరీ నుంచి 5వ తరగతి వరకూ విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు రీజనల్ ఫైర్ ఆఫీసర్ ఇ.స్వామి బహుమతులు అందజేశారు. చదువుతోపాటు మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. విద్యార్థులు.. వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను విద్యా సంస్థల ఏజీఎం ఎంవీ సురేశ్ అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా విన్యాసాలు అలరించాయి. రీజనల్ ఇన్చార్జిలు, ప్రిన్సి పాల్స్, సీబీఎస్ఈ కో-ఆర్డినేటర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్ ఆవిష్కరణ

రంగంపేట, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో ఉన్న ప్రతి రాజకీయపార్టీ సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామనే అంశాన్ని తమ మ్యానిఫెస్టోలో పెట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్‌రావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం రంగంపేట మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద సాయంత్రం ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అదేవిధంగా జిల్లా మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు విజయగౌరీ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ అయితే సీపీఎస్‌ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని తమ మ్యానిఫెస్టోలో పెడతాయో, ఆ పార్టీకే మా మద్దతు ఉంటుందన్నారు. మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఐ.విజయబాబు, వెంకటేశ్వర్లు, కోరుమిల్లి శ్రీనివాస్, అనిల్, నాగేశ్వరరావు,మూర్తి, రాజశేఖర్, రమేష్‌పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 3: జాతీయ రహదారిపై దివాన్‌చెరువు జీరో జంక్షన్‌వద్ద ఆయిల్ ట్యాంకర్ యాక్టివా ను ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు బంధం రామా రావు, సుబ్బలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. బంధువులను పరామర్శించేందుకు దేవరపల్లి నుంచి చక్రద్వారబంధం యాక్టివాపై వస్తున్న ఆ దంపతులను కాకినాడ నుంచి జంగారెడ్డిగూడెం వెళు తున్న ఆయిల్ ట్యాంకర్ స్థానిక జీరో జంక్షన్‌వద్ద ఢీకొని కొద్దిదూరం ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలో ఉన్న క్షతగాత్రులకు అటుగా వెళుతున్న వ్యక్తి సీపీఆర్ చేయడంతో వారిద్దరూ ప్రమాదం నుంచి బయటపడ్డారు. అనంతరం చికిత్స నిమిత్తం పోలీసులు వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసును బొమ్మూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'రాజకీయ సభల కోసం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తారా?'

గోకవరం, ఫిబ్రవరి 3: రాజకీయ సభల కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వైసీపీ ప్రభుత్వానికి తగదని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గునుపే భరత్ అన్నారు. గోకవరంలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దెందులూరులో ఏర్పాటుచేసిన సిద్ధం బహిరంగసభకు ఆర్టీసీ బస్సులను తరలించడం, పాఠశాలలకు కూడా సెలవులు ప్రకటించి ఆ బస్సులను కూడా ఆ సభకు తీసుకెళ్లడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జక్కుల చిన్ని, పల్లా నరేష్, ఇజ్జిన వెంకటేష్, రాపాక వీరబాబు, బొబ్బర్ల కామరాజు, కొల్లపు చంటి, గునుపే బాలచంద్ర, వడ్లపాటి పవన్, కొల్లపు సురేష్, రమేష్ పాల్గొన్నారు.

'బీసీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి'

రంగంపేట, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో ఉన్న బీసీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సానబోయిన రామారావు డిమాండ్ చేశారు. శనివారం రంగంపేటలోని నల్లచెరువు దగ్గర ఉన్న రాయప్ప పంతులు సత్రం వద్ద ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు స్థానిక సంస్థలలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మండలానికి ఒక బీసీ కమ్యూనిటీహాలు ఏర్పాటుచేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, దుర్భర పరిస్థితుల్లో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో సదుపాయాలు మెరుగు పరచాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, బీసీలకు అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలలో రాజకీయ రిజర్వేషన్ల కల్పించేందుకు కృషిచేసే పార్టీకే తమ మద్దతు ఉంటుందన్నారు. ఈసమావేశంలో ఉపాధ్యక్షుడు ఉప్పిడి గంగాధర్, ప్రధానకార్యదర్శి గోర్స తాతబ్బాయియాదవ్, కోశాధికారి గుత్తుల సుబ్రహ్మణ్యం, కార్యదర్శులు చిన్న, సత్యనారాయణ, బీసీ నాయకులు కోసెట్టి తాతారావు, కర్రి రామకృష్ణ, అప్పన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ (ఫైల్)

మంత్రిగారూ.. ఇదేం తీరు!

- గుడ్ మార్నింగ్ పేరుతో ప్రచారం
- నాయకుల చుట్టూ అధికారులు
- గ్రామాలను గాలికొదిలేసిన వైనం
- ఎంపీడీవోలకే జనసమీకరణ బాధ్యత?

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 3: మంత్రి గారొస్తున్నారంటే మంది మార్బలం అంతా కలిసి రావాల్సిందే.అంగన్‌వాడీ కార్యకర్త నుంచి రెవెన్యూ సిబ్బంది వరకూ అంతా ఆయన వెనుక ఉండాల్సిందే.. ఇదేదో ప్రభుత్వ కార్యక్రమం అనుకునేరు కాదండోయ్ బాబూ.. ఇది మంత్రి గారి ప్రచార కార్యక్రమం.. రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌చార్జిగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను వైసీపీ అధిష్ఠానం ఎంపిక చేసిన విషయం విదితమే.దీనిలో భాగంగా గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం రూరల్ అంటూ ఒక ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆ కార్యక్రమం ఎక్కడ ఆరంభమైతే అక్కడ మందీ మార్బలం అంతా ఆయన వెనుకు ఉండాల్సిందే మరి.. ఒక్కరోజుతో పోయేది కాదు కదా ఆయన పర్యటించినంత కాలం ఆయన కూడా ఉండాల్సిందే మరి.. జన సమీకరణ బాధ్యతతో పాటు నిర్వహణ ఆయా ఎంపీడీవోలకు అప్పగించడంతో ప్రభుత్వం నుంచి నిధులు రాకున్నా పంచాయతీలకు సంబంధించిన ప్రజాధనంతోనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అధికారులు విధులను పక్కనపెట్టి మంత్రి, నాయకుల భజనతో సరిపెట్టుకుంటూ గ్రామాలను గాలికొదిలేశారు.దీంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఎవరితో చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉంది. ఆయనపర్యటించిన చోట ఉన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదేం పాలన..మంత్రిగారొచ్చారంటే సమస్యలు పరిష్కరించాలి కానీ కొత్త సమ స్యలు పుట్టుకొస్తున్నాయని వాపోతున్నారు.మంత్రి, అధికార పార్టీ నాయకుల ప్రచార కార్యక్రమాలకు ప్రజాధనం వెచ్చిస్తున్నారు. అయితే అదే గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు మాత్రం నిధుల్లేవంటూ చెప్పడం విశేషం.మండలంలోని 10 గ్రామాలు ప్రత్యేకాధికారుల పాలనలోనే ఉండడంతో రూరల్ మండలంలోనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కోడ్ వచ్చేవరకు ఇంతేగా!

ఒక వైపు మంత్రిగారితో పాటు, కలెక్టర్ కూడా ఆదేశించడంతో పలు కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని ఎన్నికల కోడ్ వచ్చే వరకు తమకు తప్పేటట్టు లేదని రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావు పరోక్షంగా చెబుతున్నారు. మరొక విషయం ఏమిటంటే శ్రీనివాసరావు కోనసీమ ప్రాంతంలోని అంబాజీపేట మండల రెగ్యులర్ ఎంపీడీవోగా ఉంటూ రూరల్ మండలంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.దీంతో మంత్రి కార్యక్రమాల నిర్వహణపై మరింత బాధ్యతగా ఉంటున్నారంటూపలువురు విమర్శిస్తున్నారు.



బ్లాక్.. మనీ!

నల్లధనానికి.. మద్యమే మార్గంగా..

ఎక్కడైనా ఓకే అక్కడ మాత్రం షాకే.. ఫోన్ పే.. గూగుల్ పే అంటే కుదరదు.. మనీ ఇవ్వాల్సిందే మందు తీసుకోవాల్సిందే.. ఇదీ బ్రాందీ షాపుల్లో పరిస్థితి.. డిజిటల్ లావాదేవీలపై ప్రభుత్వం ఆది నుంచి శ్రద్ధ చూపడం లేదు.. నేటికీ అదే విధానం కొనసాగుతోంది.. కేంద్రం హెచ్చరించినా ప్రభుత్వ తీరులో మాత్రం మార్పు లేదు.. క్యాష్ కొట్టు.. బాటిల్ పట్టు.. అనే విధానమే ఉంది.. అయితే ప్రస్తుతం ఎన్నికల ఏడాది కావడంతో ఈ బ్లాక్ మనీ ఏ విధంగా వినియోగిస్తారోనని మేధావులు ఆందోళన చెందుతున్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

2019 ఎన్నికల ముందు రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక నిషేధం మాట దేవుడెరుగు మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వానికి లాభసాటి వనరుగా జగన్ మార్చేశారు. దేశానికి చేటు చేస్తున్న నల్లధనం పని పట్టేపనిలో కేంద్ర ప్రభుత్వం ఉంటే.. రాష్ట్ర పాలకులు అందుకు భిన్నంగా వ్యవహరించడం విస్మయం కలిగిస్తోంది. నల్లధనాన్ని పరోక్షంగా ప్రోత్సహించే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తోందనే విషయం జగమెరిగిన సత్యం. డబ్బు మూటలకే ప్రాధాన్యం ఇస్తూ మద్యం షాపుల్లో డిజిటల్ పేమెంట్లను జగన్ సర్కారు కావాలనే పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.దీంతో డిజిటల్ పేమెంట్ల తంతు అంతంతమాత్రంగా సాగుతోంది.మద్యం అమ్మకాల ద్వారా వచ్చే కోట్లాది రూపాయలు నల్లధనం రూపంలో అవినీతి దందాలకు తరలిపోతుందంటూ ప్రతిపక్షాలు నాలుగేళ్ల నుంచీ గగ్గోలు పెడుతున్నా పాలకుల చెవికెక్కడంలేదు. ఎన్నికల వేళ ఈ నగదు ప్రజాస్వామ్యానికే ముప్పు తెచ్చే అవకాశం ఉందని ప్రజల్లో భయం వ్యక్తమవుతోంది.

కావాలనే కాలయాపన

మద్యం షాపులు, బార్ల ద్వారా వందల కోట్లలో నగదు లావాదేవీలు జరుగుతాయి. దీనిని సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు పట్టించుకోవడం లేదు. డిజిటల్ లావాదేవీలపై ప్రభుత్వం పెద్దగా శ్రద్ధ చూపకపోవడంతో నల్లధనానికి ఊతమిచ్చే విధానం నాలుగేళ్లుగా నడుస్తోంది. డిజిటల్ పేమెంట్ల విషయంలో కావాలని కాలయాపన చేస్తూ మొత్తానికి మళ్లీ ఎన్నికల వరకూ నెట్టుకొచ్చేశారు. వైసీపీ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో తొలుత పట్టణ ప్రాంతాల్లో తర్వాత గ్రామాల్లో అమలు చేస్తామని ప్రభుత్వం 2021 ఆగస్టులో ప్రకటించింది. మద్యం షాపుల్లో డిజిటల్ పేమెంట్లు తీసుకోవాలంటూ 2022 జూలైలో రాష్ట్ర సర్కారుకు కేంద్ర ప్రభుత్వం లేఖ రాసింది.దీంతో స్వీకరిస్తామంటూ 2022 నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. కానీ నెలలు గడిపేసింది. విజయవాడలో ప్రయోగాత్మకంగా 11 షాపుల్లో ప్రారంభిస్తామని 2023 ఫిబ్రవరిలో పేర్కొంది. ఏదో కంటి తుడుపుగా డిజిటల్ ప్రారంభించింది.

ఎన్నికల వేళ ప్రమాదం

మద్యం అమ్మకాలను ప్రభుత్వం ప్రధాన ఆదాయ వనరుగా మార్చేసుకుంది.గతంలో రూ.60కి దొరికే చీప్ లిక్కర్ ఇప్పుడు రూ.150కి చేరింది. రూ.120కి దొరికే క్వార్టరు రూ.230.. బీరు ఏకంగా రూ.330 అయిపోయింది. ఎక్కువగా అమ్ముడయ్యే మద్యంపై ఇటీవల మరోసారి సర్కారు రేట్లు బాదేసింది. దీంతో ప్రభుత్వ గల్లాపెట్టెకు మద్యం ద్వారా గతంలో ఎన్నడూ లేనంతగా ఆదాయం సమకూరుతోంది.దీనిలో 99 శాతం నగదు లావాదేవీలే ఉంటాయి. అదనంగా వసూలు చేస్తున్న డబ్బులు, నగదు లావాదేవీల ద్వారా దారి మళ్లించిన సొమ్ము ఎన్నికల 'ఖర్చు'లకు జాగ్రత్త చేసుకుంటున్నారని సమాచారం. వైసీపీ

- క్యాష్ కొట్టు.. బాటిల్ పట్టు..
- మత్తులో డిజిటల్ పేమెంట్లు
- జనవరిలో కేవలం 0.26శాతమే
- వందల కోట్లలో నగదు లావాదేవీలు
- డిజిటల్‌పై కేంద్రం ప్రోత్సాహం
- డబ్బు మూటలకే రాష్ట్రం ప్రాధాన్యం
- 'ఖర్చు'లకు ఇదే ప్రధాన మార్గం!
- ఎన్నికల వేళ ఇదో విసిత్రం

నాయకులు ఎంత వెచ్చించైనా ఓట్ల కొనుగోలుకు దిగే ప్రమాదం ఉందని ప్రజాస్వామ్యవాదులు భయాం దోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో వైసీపీ నాయకుల సొంత సరుకు ఏరులై పారుతుందనే చర్చ నడుస్తోంది.



జిల్లాలో 0.26 శాతం

జిల్లాలో మొత్తం 145 ప్రభుత్వ మద్యం షాపులు, 25 బార్ల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ మద్యం షాపుల్లో ఇన్నేళ్లుగా డిజిటల్ పేమెంట్ల ఊసులేదు. గతేడాది మే నెలలో ఈ విధానాన్ని తీసు కొచ్చారు. ప్రభుత్వ మద్యం షాపులకు స్వైపింగ్ మిషన్లు, స్కానింగ్ స్టిక్కర్లు అందజేశారు.25 శాతం ఎస్‌బీఐ ద్వారా, 75 శాతం షాపులకు పేటీఎం ద్వారా డిజిటల్ పేమెంట్ల సదుపాయం కల్పించారు. కానీ చాలా షాపుల్లో డిజిటల్ పేమెంట్ల మిషన్లను మూలనపడేశారు. జనవరిలో అత్యధికంగా రూ.100 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. డిజిటల్ పేమెంట్లు జరిగింది మాత్రం కేవలం రూ.25 లక్షలే. బార్లలో ముందు నుంచీ డిజిటల్ పేమెంట్లు ఉన్నా యి. కానీ క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ.60-70 వసూ లు చేస్తున్నారు. బీరుపై రూ.100 వరకూ లాగేస్తున్నారు. నగదు లావాదేవీలు జరిగినవాటిలో ఈ అదనపు సొమ్ము లెక్కల్లోకి వెళుతుందో లేదో అనేది మాత్రం రహస్యం.

సాంకేతికంగా వంక

డిజిటల్ పేమెంట్ల విషయంలో సాంకేతికంగా వంకలు చూపెడుతున్నారు. ఆన్‌లైన్ లేదా ఎలక్ట్రానిక్ వస్తువుల్లో సాంకేతిక లోపాలు తలెత్తడం సర్వసాధారణం. అయితే, మద్యం షాపులకు ఇచ్చిన స్వైపింగ్ మిషన్లలో సాంకేతిక లోపం వస్తే 'మంచే' జరిగిందనుకునే చందంగా పరిస్థితి ఉంది. ఎస్‌బీఐ, పేటీఎం గేట్‌వేల ద్వారా డిజిటల్ పేమెంటు విధానాన్ని కల్పించారు. దీనిలోనూ మెలిక పెట్టారు. పేటీఎం ద్వారా క్రెడిట్ కార్డులు పనిచేసేవికావు. ఎవరైనా మందు సీసా కొనుగోలు చేస్తే దానిని స్కాన్ చేస్తారు. కంప్యూటర్ స్క్రీన్‌పై డిజిటల్, క్యాష్ ఆప్షన్లు వస్తాయి. డిజిటల్ అని కొట్టగానే పేమెంటు అవుతుంది. అమ్మకం అయినా ఆ సీసా నిల్వ సంఖ్య నుంచి తగ్గుతుంది. అయితే ఒక్కోసారి పేమెంటు పూర్తి కాకుండా 'అండర్ ప్రాసెస్' అని వస్తుండడం, అది చాలా సేపటి వరకూ క్లియర్ కాకపోవడం వంటి వాటి వల్ల ఇబ్బంది తలెత్తుతుందని చెబుతున్నారు. ఇదేదో పరిష్కారానికి సాధ్యం కాని విషయంగా వదిలేయడం గమనార్హం. ఇక షాపుల్లో సాయంత్రం సమయాల్లో ముందు నుంచీ డిజిటల్ పేమెంట్లను స్వీకరించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ వల్ల సమస్య ఏర్పడుతోంది. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ వినియోగించే విశిష్ట యాప్‌లోనూ లోపాలున్నాయన్నాయని చెబుతున్నారు.ఈ యాప్‌ను వైసీపీ ప్రభుత్వం వచ్చాక తీసుకొచ్చింది. ఈ యాప్‌తో అటు షాపుల వాళ్లు, ఇటు ఎక్సైజు సిబ్బంది మొదటి నుంచీ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

డిజిటల్ డీలా...



నెల	అమ్మకాలు(కోట్లలో)	డిజిటల్ పేమెంట్లు	శాతం
మే	90,28,38,030	1,40,78,260	1.55
జూన్	86,58,97,350	2,30,42,140	2.66
జూలై	85,18,40,630	3,21,95,180	3.77
ఆగస్టు	80,82,31,510	4,12,62,620	5.10
సెప్టెంబరు	76,60,28,980	4,47,86,540	5.52
అక్టోబరు	77,57,84,100	3,79,12,810	4.66
నవంబరు	75,37,36,230	3,81,44,470	4.82
డిసెంబరు	84,16,58,100	1,05,07,210	1.23
జనవరి	99,46,33,660	25,60,760	0.26



రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జనం వెయిటింగ్



బస్సులు రాక.. ఆటోలకు పరుగులు



దెందులూరులో జరిగిన సిద్ధం సభకు ఖాళీగా వెళ్తున్న బస్సు

జనాగ్రహానికి సిద్ధం!

- బలవంతంగా 'సిద్ధం' చేశారు
- బెదిరింపులతో జనాల తరలింపు
- ప్రయాణికుల కస్సు బస్సు
- జగన్ సభతో తీవ్ర ఇబ్బందులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి)/రాజమహేంద్రవరం అర్బన్ : ఏలూరులోని జగన్ సభకు జిల్లాలోని వైసీపీ నాయకులు జనాలను బలవంతంగా 'సిద్ధం' చేశారు. వాళ్లను పంపించడానికి నానాతంటాలూ పడ్డారు. ముందు రోజు నుంచే వెతుకు లాటలో స్థానిక నాయకులు బిజీ అయ్యారు.ఎక్కువగా రోజువారీ/కూలి పనులు చేసుకునే వాళ్లపైనే దృష్టి సారించారు. దీని కోసం సచివాలయ సిబ్బందిని యథావిధిగా రంగంలోకి దించారు. కొన్ని సీట్లను యాచకులతో నింపారు. రాజమహేంద్రవరంలో ఎంపీ భరత్‌రామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సుల్లో కుర్రకారు, వృద్ధులు, చిన్నాచితకా పనులు చేసుకొనే వాళ్లే కనిపించారు. వాళ్లను ఉదయం 8 గంటలకే ఇళ్లకు వెళ్లి బలవంతంగా తీసుకొచ్చి బస్సులు ఎక్కించి ఎంపీ కార్యాలయానికి తీసుకొచ్చారు. 11 గంటల ప్రాంతంలో ఎంపీ భరత్, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, గుడా చైర్మన్ రౌతు సూర్య ప్రకాశరావు ఆర్భాటంగా జెండాలు ఊపి బస్సులను వదిలారు. అప్పటి వరకూ బస్సుల్లో తరలించిన వారికి కనీసం మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో చాలా ఇబ్బంది పడ్డారు. బస్సులకు వైసీపీ స్టిక్కర్లు అంటిస్తుండగా బస్సుల సిబ్బంది కొంత అసహనం వ్యక్తం చేశారు. స్కూల్ బస్సులు కాబట్టి ఎక్కువగా అంటించవద్దని అభ్యర్థించారు. వైసీపీ నాయకులు వినిపించుకోకుండా పాఠశాల బస్సులను వైసీపీ జెండాలతో ముంచేశారు. ఇంత తతంగం చేసినా ప్రజలు విముఖత చూపడంతో జనాల కంటే బస్సుల్లో ఖాళీ సీట్లే ఎక్కువగా తరలి వెళ్లాయి. సీఎం జగన్మోహనరెడ్డి శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో నిర్వహించిన సిద్ధం సభకు జిల్లాలోని నాలుగు డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులను పెద్దసంఖ్యలో పంపించడంతో జిల్లాకు చెందిన ఆర్టీసీ ప్రయాణీకులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆస్పత్రులకు, అత్యవసర పనులపై, పుణ్యక్షేత్రాలకు వెళ్లిన వాళ్ళకు నరకం కనిపించింది. సీఎం సభకు జనాలను తరలించడానికి జిల్లా నుంచి 90కి పైగా ఆర్టీసీ బస్సులను అధికారులు ఆయా ప్రాంతాలకు పంపించారు. రాజమహేంద్రవరం డిపోతో పాటు గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి ఈ బస్సులన్నీ శుక్రవారం రాత్రే బయలుదేరి వెళ్లాయి. దీంతో చాలా రూట్లలో బస్సులకు కొరత ఏర్పడింది. బస్సులు అరకొరగా రాకపోకలు సాగించడంతో రాజమహేంద్రవరం బస్ కాంప్లెక్స్‌లో ప్రయాణీకులు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. బస్సులు లేవన్న విషయం తెలియక పిల్లా పాపలతో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చిన చాలా మంది ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పలేదు. రాజమహేంద్రవరం కాంప్లెక్స్ నుంచి కొవ్వూరు, నిడదవోలు, ఏలూరు వైపు వెళ్లే ప్రయాణీకులతోపాటు జంగారెడ్డిగూడెం, అమలాపురం, తుని, కాకినాడ రూట్లలోనూ బస్సు ప్రయాణీకులు అవస్థలు పడ్డారు. బస్ కాంప్లెక్స్‌లోని కంట్రోలర్లు బస్సు షెడ్యూళ్లను ఏదోలా మేనేజ్ చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆర్టీసీ అధికారులపై ప్రయాణీకుల నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయి. చాలా మంది ప్రయాణీకులు ఆటోలను ఆశ్రయించక తప్పలేదు. ఈ బస్సులన్నీ శనివారం రాత్రికి ఆయా డిపోలకు చేరుకుంటాయని, ఆదివారం యథావిధిగా తిరుగుతాయని ఆర్టీసీ అధికార వర్గాలు చెబుతున్నాయి. జగన్ సభ కోసం ఇంత ఇబ్బంది పెట్టాలా? అంటూ ఆగ్రహం వ్యక్తమైంది.

టిక్ టాక్ శ్రీను ఆత్మహత్య



కొవ్వూరు/తాళ్లపూడి, ఫిబ్రవరి 3 : ఒంటరి తనం భరించలేక ఒ క వ్యక్తి కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జి పైనుంచి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన యడ్లపల్లి శ్రీనివాసు (45) అలియాస్ టిక్‌టాక్ శ్రీనుగా సుపరిచి తుడు. మృతుడు శ్రీనివాస్ సగ్గొండ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. అయితే టిక్‌టాక్ చేస్తూ మంచి పేరు సంపాదించాడు. జీవితం సాఫీగా సాగిపోతుండగా 8 సంవత్సరాల కిందట మృతుడి ఇద్దరు పిల్లలు పాముకాటుకు గురై రోజు విడిచి రోజు తేడాలో మృతిచెందారు. అనంతరం భార్య భర్తలిద్దరూ ఒక బాలికను దత్తత తీసుకున్నారు. ఏదో తేరుకుంటుండగా భార్య, తండ్రి ఏడాది కిందట చనిపోయారు.అప్పటి నుంచి మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు.ప్రస్తుతం తల్లి,దత్తత కుమార్తెతో కలిసి ఉంటున్నాడు. ఏం జరిగిందో ఏమో కానీ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జిపై బైక్ పార్క్ చేసి నదిలో దూకేశాడు. కొవ్వూరు ఇసుక ర్యాంపు పడవ కార్మికులు గమనించి శ్రీనివాస్‌ను నది నుంచి ఎరినమ్మ ఘాట్ ఇసుక ర్యాంపుకు తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి మేనల్లుడు పవన్‌కుమార్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్య

తుఫాన్‌తో నష్టం.. తేరుకోని రైతు

పెరవలి, ఫిబ్రవరి 3 : పంట నష్టం తట్టుకోలేక కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెరవలి మండ లం ఖండవల్లికి చెందిన తుమ్మూరి వెంకటేశులు (35) కౌలు వ్యవసాయం 8 ఎకరాలు చేస్తున్నాడు. ఈ ఏడాది వరి, కూరగాయలు సాగు చేశాడు. అయితే తుఫాన్ కారణంగా 8 ఎకరాల్లో పంటను నష్టపోయాడు. దీంతో లక్షల్లో నష్టం వాటిల్లింది. దీంతో అప్పులపాలయ్యాడు. అప్పటి నుంచి కాస్త ముభా వంగా ఉంటున్నాడు. తోటి రైతుల వద్ద బాధను వ్యక్తం చేసేవాడు.చివరకు అప్పులు తీర్చే మార్గం కానరాక శనివారం ఉదయం పొలానికి పురుగు మందు చల్లాలని చెప్పి వెళ్లాడు. కౌలుకు తీసుకున్న పొలంలోనే కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు.సమీపంలో రైతులు వెంకటేశులను గమనించి వెంటనే ఆసు పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతదేహానికి తణుకు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి యూకేజీ, నర్సరీ చదువుతున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని తోటి రైతులు డిమాండ్ చేశారు.

జిల్లాలో ముగిసిన ఆడుదాం ఆంధ్రా

9 నుంచి విశాఖలో రాష్ట్రస్థాయి పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 3 : ఆడుదాం ఆంధ్రా కీడల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలే అని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానంలో శనివారం జరిగిన ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి క్రీడల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఇది మంచి అవకాశం అన్నారు. ఫిబ్రవరి 9 నుంచి 13వ తేదీ వరకూ విశాఖపట్నంలో జరిగే పోటీల్లో పాల్గొని జిల్లాకు పతకాలు తేవాలని కోరారు. జిల్లాస్థాయిలో 27 బృందాలు విజేతలుగా నిలిచారు. జిల్లాస్థాయి విజేతలకు బహుమతులు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రమజీవులకు ఉపయోగం కాని బడ్జెట్

పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమన్నారాయణ



కేంద్ర బడ్జెట్‌పై నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

కొవ్వూరు, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కష్టజీవులు, శ్రమజీవులకు ఉపయోగపడేలా లేదని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ అన్నారు. శనివారం కొవ్వూరు మండలం పంగిడిలో సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ, పౌరహక్కుల సంఘం, ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యు, ప్రజా సంఘాల నాయకులు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ ప్లకార్డులు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం వల్ల ప్రజల జీవన, ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కార్పొరేట్ల కనుసన్నల్లో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని విమర్శించారు. మహిళలు, కార్మికులు, శ్రమజీవులను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు సీహెచ్ రమేష్, పి.నాగేశ్వరరావు, పీవోడబ్ల్యు, నాయకురాలు ఈమని మల్లిక, పంగిడి మోటారు వర్కర్స్ యూనియన్ నాయకుడు సూరేపల్లి శ్రీను, క్వారీ వర్కర్స్ యూనియన్ నాయకుడు గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల ఎంపీడీవోగా నరేష్



నల్లజర్ల, ఫిబ్రవరి 3: నల్లజర్ల ఎంపీడీవోగా పీఎస్ నరేష్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కోరుకొండ ఎంపీడీవోగా పని చేసి బదిలీపై నల్లజర్ల వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యంపై దృష్టి సారిస్తానన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

పెరవలి తహశీల్దార్‌గా సుధ

పెరవలి, ఫిబ్రవరి 3: మండలంలో ముగ్గురు మండల స్థాయి అధికారులు బదిలీ అయ్యి కొత్త వారు నియమితులయ్యారు. తహశీల్దార్‌గా కృష్ణా జిల్లా ముదునూరు మండలానికి చెందిన డి.సుధ, ఎంపీడీవోగా ఉమామహేశ్వరి నియమితులయ్యారు. ఎస్ఐగా ఏజీఎస్ మూర్తి నియమితులయ్యారు. వీరు ముగ్గురు సోమవారం విధుల్లో జాయిన్ అయ్యే అవకాశం ఉందని తెలిసింది.

ఉండ్రాజవరం ఎంపీడీవోగా నరేంద్రరెడ్డి



ఎంపీడీవో నరేంద్రరెడ్డిని అభినందిస్తున్న సిబ్బంది

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 3: ఉండ్రాజవరం ఎంపీడీవోగా కె.నరేంద్రరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన జీవీఎస్‌కే రాజు ఏలూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నరేంద్రరెడ్డిని ఈవోపీఆర్డీ జేడీపీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

నిడదవోలులో అన్నసమారాధన

నిడదవోలు, ఫిబ్రవరి 3: నిడదవోలులోని చర్ల సుశీల వృద్ధాశ్రమంలోను, ప్రభుత్వాసుపత్రిలోను శనివారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక సెయింట్ ఆంబ్రోస్ హైస్కూల్ విశ్రాంత ఉపాధ్యాయుడు వేమూరి వీర వెంకట సత్యనారాయణమూర్తి ప్రథమ వర్ధంతి సందర్భంగా 1986-87బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ ఖండవల్లి గోపాలస్వామి, పూర్వ విద్యార్థులు మహ్మద్ హసన్, అవిడి శ్రీనివాస్, మాదు నాగేశ్వరరావు, మద్దాల విజయ్ ప్రసాద్, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.


భూవివాదంపై ప్రక్కిలంకలో గ్రామ సభ



గ్రామ సభలో మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వరరావు, మల్లిబాబు

తాళ్లపూడి, ఫిబ్రవరి 3: మండలం ప్రక్కిలంక గ్రామంలో ఓ భూవివాదంపై శనివారం గ్రామ సభ నిర్వహించారు. దళిత వర్గానికి చెందిన నక్కా వెంకటేశ్వరావు అనే యోగా టీచర్‌కు దాతలు ఇచ్చిన స్థలంలో సూర్యదేవాలయం నిర్మించనుండడంతో వివాదాస్పద స్థలంగా ఉందని, ఆ స్థలంలో ఎవ్వరూ నిర్మాణాలు చేపట్టడం గానీ, కట్టింది తొలగించడానికి గానీ ఎవ్వరూ వెళ్లవద్దని ప్రక్కిలంక పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ప్రకటించారు. నక్కా వెంకటేశ్వరరావు తన స్థలంగా చెబుతున్న స్థల దస్తావేజులు రద్దు చేయాలని, ఆలయం నిర్మిస్తున్న స్థలం గ్రామ కంఠమని, ఆలయ నిర్మాణం ఆపాలని ముళ్ల మల్లిబాబు ఆధ్వర్యంలో గ్రామస్థులు తీర్మానం చేశారు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తనకు దాతలు ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారని, స్థలంపై ఫిర్యాదు చేసిన వారంతా ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించి కొంతకాలంగా తనను వేధిస్తున్నారని, అప్పటి ఎస్ఐ వెంకటరమణ వివాదం సర్దుబాటు చేశారని ఈ స్థలంలో తానేమీ అసాంఘిక కార్యకలాపాలు చెయ్యడం లేదని, దాతల సహకారంతో సూర్యదేవాలయం నిర్మిస్తున్నట్టు చెప్పారు.


మహిళా క్రికెట్‌లో దేవరపల్లి జట్టుకు ప్రథమ స్థానం



కలెక్టర్ నుంచి కప్పు అందుకుంటున్న దేవరపల్లి మహిళా క్రికెట్ టీమ్

దేవరపల్లి, ఫిబ్రవరి 3: ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలు రాజమహేంద్రవరంలో ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఈ మహిళా క్రికెట్‌లో దేవరపల్లి మండలానికి చెందిన జట్టు ప్రథమ స్థానం సాధించి కప్పు గెలుచుకుంది. కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా కప్పు అందుకున్నారు. పంచాయతీ కార్యదర్శి కే.రవికిషోర్ టీమ్‌ను అభినందించారు. అలాగే యర్నగూడెం సచివాలయం పరిధిలో ఖోఖో టీమ్‌లో జిల్లా ప్రథమ స్థానం సాధించినట్టు తెలిపారు.

హైస్కూల్‌కు కంప్యూటర్, ప్రింటర్ అందజేత



కంప్యూటర్, ప్రింటర్ అందజేస్తున్న దాతలు

గోపాలపురం, ఫిబ్రవరి 3: హుకుంపేట శివారులోని జడ్పీ ఉన్నత పాఠశాలకు దాత హోతా రాజాబాబు ఆర్థిక సాయంతో రూ.70వేలు విలువైన కంప్యూటర్, ప్రింటర్‌ను కొనుగోలు చేసి హెచ్ఎం అచ్యుతమోహన్, పీసీ కమిటీ ఛైర్మన్ బిక్కవోలు నాగేశ్వరరావుకు శనివారం అందజేశారు. గ్రామంలో నివసిస్తున్న ప్రజలకు అవసరమైన సామాజిక అవసరాలకు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాయపాటి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

టీడీపీ నిడదవోలు, గోపాలపురం ఇన్‌చార్జిలు బూరుగుపల్లి, మద్దిపాటి

నిడదవోలు/నల్లజర్ల, ఫిబ్రవరి 3: రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే జగన్ రెడ్డి కొత్త డ్రామాకు తెరదీశాడని, నిరుద్యోగులను వంచించడానికి మరోసారి సిద్ధమయ్యారని, వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అని టీడీపీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శనివారం నిడదవోలు, నల్లజర్లలో జరిగిన వేర్వేరు



నల్లజర్ల సమావేశంలో మాట్లాడుతున్న మద్దిపాటి వెంకట్రాజు



నిడదవోలులో సమావేశంలో మాట్లాడుతున్న బూరుగుపల్లి శేషారావు

సమావేశాల్లో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 50,892 పోస్టులు ఖాళీలుంటే 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగుల్ని మోసం చేయడమేనన్నారు. దేశ వ్యాప్తంగా 11శాతం నిరుద్యోగం ఉంటే జగన్ రెడ్డి నిర్వాకంతో ఏపీలో 24శాతం ఉందన్నారు. తెలుగుదేశం రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా మార్చితే జగన్ రెడ్డి రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా మార్చారన్నారు. సమావేశాల్లో నిడదవోలు అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, కారింకి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, నల్లజర్లలో యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్, యలమాటి శ్రీనివాసరావు, నిమ్మలపూడి ప్రసాద్, కండెపు వెంకటరత్నం పాల్గొన్నారు.

స్వామి వివేకానంద ఆశయాల సాధనకు కృషి

- వివేకానంద యువజన సమితి వ్యవస్థాపకుడు రాఘవేంద్ర
- కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంలో క్విజ్ పోటీలు

కొవ్వూరు, ఫిబ్రవరి 3: స్వామి వివేకానంద ఆశయాలను యువతకు చేరవేయడమే లక్ష్యంగా జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్టు వివేకానంద యువజన సమితి వ్యవస్థాపకుడు ఎస్.రాఘవేంద్ర తెలిపారు. వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంలో వివేకానంద యువజన సమితి ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా రామకృష్ణ మఠం స్వామిజీ వేద విద్యానంద, ఇస్రో రిటైర్డ్ ఇంజనీరు విష్ణువజ్ఝుల ఎస్ఎస్ఎస్ రమణమూర్తి, సమితి పూర్వ అధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, సైంటిఫిక్ స్టూడెంట్స్ సంస్థ నిర్వాహకులు ఎస్‌జీ శ్రీనివాస్, దోర్బల ప్రభాకరశర్మ, రిటైర్డ్ ఇంజనీరు బి.సుబ్బారావు మాట్లాడుతూ ఇటువంటి పోటీలు యువకుల్లో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. మద్రాసు ఐఐటీ ప్రాజెక్టు సిబ్బంది రాధేశ్యామ్ ఫైనల్ పోటీలకు మాస్టర్‌గా వ్యవహరించారు. పోటీల్లో జూనియర్ విభాగంలో కొవ్వూరు డీఏవీ పాఠశాల, రాజమహేంద్రవరం లిటిల్ ప్యారడైస్, కొవ్వూరు నారాయణ పాఠశాల విద్యార్థులు, సీనియర్ విభాగంలో మండపేట మున్సిపల్ హైస్కూల్, రాజమహేంద్రవరం శ్రీసత్యసాయి గురుకులం, కొవ్వూరు భాష్యం పాఠశాల విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు టెలిస్కోప్, ల్యాప్‌టాప్, గిటార్, కీబోర్డు, రోబోటిక్స్ కిట్, క్రికెట్ కిట్, ఎన్‌సైక్లోపీడియా, ఇంకా మరెన్నో బహుమతుల్లో నచ్చిన వాటిని ఎంచుకునే అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 20 పాఠశాలల నుంచి సుమారు 2000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గైట్ కళాశాల లైబ్రేరియన్ మీరా, విద్యార్థులు అనీల్, శ్రీకర్, చాందిని, రనితలు పోటీలకు సహకారం అందించారు.



పోటీలను ప్రారంభిస్తున్న రామకృష్ణ మఠం స్వామిజీ వేదవిద్యానంద

ఈ నెల 29లోపు.. వ్యాపారులు కార్మిక శాఖ లైసెన్సు పొందాలి

- డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దుకాణదారులు తప్పనిసరిగా కార్మిక శాఖ నుంచి లైసెన్సు పొందాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్, వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలు, మోటారు రవాణా వాహన యాజమాన్యాలు, భవన తదితర నిర్మాణ సంస్థలు, కాంట్రాక్టు కార్మికుల యజమాన్యాలు, ప్రిన్సిపల్ ఎంప్లాయర్లు, అంతర్రాష్ట్ర వలస కార్మికులను వినియోగించే వారు కార్మిక చట్టా ప్రకారం విధిగా ఈ నెల 29లోపుగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఆంధ్రప్రదేశ్ దుకాణాలు సంస్థల చట్టం-1988, భవన ఇతర నిర్మాణ వర్కర్స్ చట్టం-1996, కాంట్రాక్టు లేబర్ చట్టం-1970, పేమెంట్ ఆఫ్ గ్రాట్యుటీ చట్టం-1972, మోటారు రవాణా వర్కర్స్ చట్టం-1961, బీడీ అండ్ సిగార్ వర్కర్స్ చట్టం-1966, ఇంటర్ స్టేట్ మైగ్రెంట్ వర్కర్స్ చట్టం-1979 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన సంస్థలు/యాజమాన్యాలు విడివిడిగా కాకుండా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం-2015ను ప్రకారం ఒకే రిజిస్ట్రేషను సర్టిఫికెట్/లైసెన్సు పొందే వెసులుబాటును వినియోగించుకోవాలని కోరారు. కార్మిక చట్టాలన్నిటికీ కలిపి ఒకే రిజిస్ట్రేషన్ పొందే అవకాశం ఉందని జిల్లా ఇన్చార్జి అధికారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్ఎం వలి తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషను పొందినవారు తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలన్నారు. గడువు లోపుగా నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషను సర్టిఫికెట్ పొందని వాళ్లు చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారన్నారు. అలాగే. బాలబాలికలు బడిలో ఉండాలని.. అలా కాకుండా పనిలో పెట్టుకోవడం, వెట్టి చాకిరీ చేయించడం నేరమన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యతని గుర్తెరగాలన్నారు. ఇప్పటికే నిఘా పటిష్టం చేశామని పేర్కొన్నారు. బాల కార్మికుల గురించి సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని వలి కోరారు.

రామాలయం ప్రభుత్వ విజయమని రాష్ట్రపతి ముర్ము అనడం సరికాదు

- రామాలయం మతానికి సంబంధించినది
- అబద్ధాలు, పుకార్ల ప్రచారంలో భారత్‌కు నెంబర్ 1
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): గుడి కట్టినా, మసీద్ కట్టినా, చర్చి కట్టినా అది మతానికి సంబంధించినది. దానికి ప్రభుత్వం సహాయం చేస్తే చేయవచ్చు. కానీ రామాలయం కట్టడం ప్రభుత్వ విజయమని కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము ప్రకటించడం సరికాదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇవాళ ముస్లిం దేశాలన్నీ సెక్యులర్ దేశాలుగా మారుతున్నాయి. దుబాయి వంటి దేశాల్లో గుళ్లు కడుతున్నారని ఆయన అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో మొత్తం దరిద్రమంతా తీరిపోయినట్టు చెప్పారు. ఇప్పటికే దేశంలో సగానికి పైగా అంటే సుమారు 81కోట్ల మందికి ఉచిత బియ్యం ఇస్తున్నారు. మరి దరిద్రం పోయినట్టా అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రపంచ స్థాయి సర్వే సంస్థ ఒకటి ఇటీవల మిస్ ఇన్‌ఫర్మేషన్ అండ్ డిస్ ఇన్ఫర్మేషన్(పుకారులు, అబద్ధాలు) ఇవ్వడంలో భారతదేశం నెంబర్ 1గా ఉందని తేల్చారని ఆయన వివరించారు. ఇవాళ అందరిదీ జై శ్రీరామ్ అనే నినాదమైపోయింది. వాస్తవానికి హిందూమతమే సెక్యులర్ మతం, ముక్కోటి దేవతలున్నారు. కొత్త దేవుళ్లు పుట్టుకొస్తున్నారు. ఇక బీజేపీ యాంటీ ముస్లిం వాతావరణాన్ని తీసుకొస్తోంది. అది కరెక్ట్ కాదు. బీజేపీ చెప్పేది మన మత సిద్ధాంతం కాదు. అసలు హిందూమతం శృంగేరి, కంచి పీఠాధిపతులు చెప్పేది. వాళ్లు కూడా రామాలయాన్ని వ్యతిరేకించారు. దేశంలో మోదీకి 38శాతం మద్దతు మాత్రమే ఉంది. వ్యతిరేకించే వారు 50శాతం కంటే ఎక్కువ ఉన్నారు. వాళ్లంతా కలవాలని ఉండవల్లి అభిప్రాయం వ్యక్తంచేశారు. ఉత్తర భారతదేశంలో జనాభా పెరిగిపోయింది. దక్షిణ భారతంలో కుటుంబ నియంత్రణ వల్ల జనాభా కంట్రోలులో ఉంది. లోక్‌సభ స్థానాలు పునర్విభజన జరిగితే 800 వరకూ ఎంపీ స్థానాలు ఉంటాయి. అవి ఉత్తర భారతదేశంలో పెరుగుతాయి. దక్షిణ భారతదేశంలో పెరగవు. పైగా తగ్గినా ఆశ్చర్యపోనవసరం లేదు. పైగా పన్నుల ఆదాయం మనకంటే అక్కడి రాష్ట్రాలకే ఎక్కువ వెళుతుంది. అందుకే తమిళనాడు మంత్రి ఒకరు దక్షిణ భారతదేశం ప్రత్యేక దేశంగా విడిపోయే పరిస్థితులు వస్తున్నాయని అంటే, ఆయన మీద కేంద్రం విరుచుకుపడిందన్నారు. అర్బన్ ఏరియాలో బహిరంగంగా జగన్‌ను వ్యతిరేకిస్తున్నారని, జగన్ ఎన్ని తప్పులు చేయగలడో అన్ని తప్పులు చేశాడని ఉండవల్లి అన్నారు. చంద్రబాబు, పవన్ కలవడం వల్ల వైసీపీ వణికిపోవాలని, కానీ 40శాతం మందికి ఉచిత పథకాలు ఇచ్చానని, తానే నెగ్గేస్తానని జగన్ భావిస్తున్నాడు. అయితే చంద్రబాబు అతని కంటే ఎక్కువ పథకాలు ప్రకటించారు. దీనిపై చర్చ జరగాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ బలపడవలసిన అవసరం ఉంది. షర్మిల వల్ల బలం పెరగవచ్చు. కాంగ్రెస్ పెరిగితేనే కేంద్రంలో బీజేపీని ప్రశ్నించే వీలుంటుందన్నారు. పచ్చి అబద్ధాలు ప్రచారం అవుతున్నాయని, ఏకంగా గాంధీ, నెహ్రూ వంటివారు కూడా అమ్మానాన్నలకు పుట్టలేదనే దారుణ ప్రచారాలు చేస్తున్నారని మాజీ ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు.

దళితులకు ద్రోహం చేసిన జగన్‌ను దించేయబోతున్నాం

- దళిత సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎంపీ హర్ష కుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 3: దళితులకు ద్రోహం చేసిన సీఎం జగన్‌ను దించేయబోతున్నామని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శనివారం దళిత సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో జగన్ దళితులను అణగదొక్కాడని, దళితులకు జరిగిన అన్యాయాన్ని వివరించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించేందుకే ఈనెల 11న రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో దళిత సింహగర్జన సభ నిర్వహిస్తున్నామన్నారు. దళితులకు అన్యాయం జరుగుతుంటే వైసీపీలో మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా ఉన్న దళితులు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో దళితులకు మేలు చేసే 27 పథకాలను రద్దుచేస్తే అడిగేవాడు లేడని, నవరత్నాల్లో అమ్మఒడి పథకంలో అందరికీ వేసే డబ్బులు జనరల్ ఫండ్స్ నుంచి కేటాయించి, దళితులకు మాత్రం సబ్‌ప్లాన్ నుంచి ఎందుకు కేటాయించారని హర్షకుమార్ ప్రశ్నించారు. ఎస్సీ వసతి గృహాల్లో దుర్భర పరిస్థితులు ఉన్నాయని, స్టడీ సెంటర్లు నిర్వీర్యం చేశాడని, ఇక యూనివర్శిటీల్లో వీసీలంతా జగన్ కులస్తులేనని అన్నారు. మాస్కులు అడిగినందుకు డాక్టర్ సుధాకర్, కిరణ్‌కుమార్, దొమ్మేరులో బొంత మహేంద్ర, సామర్లకోటలో గిరిబాబు, ఎర్రగొండలో మోజేష్, కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యంను పొట్టన పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. హత్యచేసిన ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ వస్తుంది కాని దళితుడైన కోడికత్తి శ్రీనివాస్‌కు బెయిల్ రాదన్నారు. కోడికత్తి శ్రీను బెయిల్ విషయంలో రాష్ట్ర గవర్నర్ స్పందించాలన్నారు. తెలంగాణంలో కేసీ ఆర్ ఎంతటి అహంకారంతో ఉన్నాడో అదే రీతిలో జగన్ ఉన్నాడని, అక్కడ కేసీఆర్‌కు పట్టిన గతే ఇక్కడ జగన్‌కు పడుతుందని హర్షకుమార్ అన్నారు. సమావేశంలో జీవీ శ్రీరాజ్, ఎర్రా రామకృష్ణ, పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో యువతను మోసగించిన సీఎం జగన్

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు జవహర్

తాళ్లపూడి, ఫిబ్రవరి 3: డీఎస్సీ ఏర్పాటు చేస్తానని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ తర్వాత ఘోరంగా మోసం చేశాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ ధ్వజమెత్తారు. కొవ్వూరులోని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ ఏర్పాటు చేసి 60 వేలకు పైగా ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని, గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ ఖాళీలను భర్తీ చేయలేదని, తాను అధికారంలోకి రాగానే ఆ ఖాళీలను భర్తీ చేస్తానని, ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలెండరు విడుదల చేస్తానని నిరుద్యోగులను మోసగించాడన్నారు. 60 రోజుల్లో ఎన్నికలు జరగబోతున్న సమయంలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని నోటిఫికేషన్ విడుదల చేశాడన్నారు. నూతన విద్యా విధానమని చాలా స్కూళ్లను మూసివేసి, ఉపాధ్యాయ ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసి, ప్రయోగాల పేరుతో విద్యా వ్యవస్థను నాశనం చేశాడని జవహర్ విమర్శించారు. విద్యావ్యవస్థను నాశనం చేస్తే ఒక తరం నాశనమయ్యే ప్రమాదముందని ఆయన అన్నారు. జగన్‌మోహనరెడ్డి పరిపాలనలో పాఠశాలలను విలీనం చేసి, బడి బయట పిల్లలను ఊరి బయట పిల్లలుగా చేసి వారి జీవితాలతో ఆడుకుంటున్నాడని అన్నారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అందరికీ అమ్మఒడి ఇస్తానని అధికారంలోకి రాగానే ఒక్క విద్యార్థికే వర్తిస్తుందని చెప్పి మోసం చేశాడని జవహర్ విమర్శించారు.

నేడు ఏపీటీఎఫ్ జిల్లా సమావేశం

తాళ్లపూడి, ఫిబ్రవరి 3: ఏపీటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా శాఖ జనరల్ బాడీ సమావేశం ఈ నెల 4వ తేదీ ఉదయం కొవ్వూరులోని హోలీ ఏంజల్స్ హైస్కూల్లో నిర్వహిస్తామని, అనంతరం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక కూడా జరుగుతుందని జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని మండలాల ఏపీటీఎఫ్ నాయకులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉండ్రాజవరం-తాడిపర్రు రోడ్డులో రాత్రుళ్లు దారి దోపిడీలు

ప్రజల్లో ఆందోళన.. పోలీసు గస్తీ ఏర్పాటుకు వినతి

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 3: మండలంలోని ఉండ్రాజవరం-తాడిపర్రు రోడ్డులో రాత్రుళ్లు దొంగలు దారికాచి దోపిడీలకు పాల్పతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కుదప చక్రపాణి పెట్రోలు బంక్ పక్క నుంచి తాడిపర్రు వెళ్లే రోడ్డులో హిందీ భాష మాట్లాడే వారు వేర్వేరు సమయాల్లో దారికాచి తాడిపర్రుకు చెందిన ఇద్దరు వ్యక్తులను కొట్టి సొమ్మును కాజేసినట్టు చెబుతున్నారు. దోపిడీ దొంగలు బిహార్‌కు చెందిన వారై ఉండవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో ఇళ్ల దొంగతనాలు జరుగుతుంటాయి కాని దారిదోపిడీలు ఎప్పుడూ లేవని, కొద్దిరోజులుగా ఈ దారి దోపిడీలు జరుగుతుండడంతో ప్రజలు భయపడుతున్నారు. పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలని తాడిపర్రు, వెలగదుర్రు, ఉండ్రాజవరం ప్రజలు కోరుతున్నారు.రాత్రి సమయాల్లో ఈ దారిలో వెళ్లవద్దని సోషల్‌మీడియాలో హల్‌చల్ చేయడంతో భయపడుతున్నారు.దీంతో నిత్యం రద్దీగా ఉండే ఉండ్రాజవరం కానూరు రోడ్డులో వెళ్లడానికి జనం జంకుతున్నారు.

గ్రూప్-2 పరీక్షా విధానంపై నేడు అవగాహన సదస్సు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3: రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో గ్రూప్-2 పరీక్షా విధానంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఈ సదస్సులో పాల్గొని పరీక్షా విధానం, ప్రశ్నాపత్రాలు, ప్రామాణిక పాఠ్య పుస్తకాలు తదితర అంశాలను వివరిస్తారు. సదస్సుకు హాజరైన అభ్యర్థులకు భారత సమాజం అనే అంశంపై 128 పేజీల స్టడీ మెటీరియల్, ఆంధ్రుల చరిత్ర-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అనే అంశాలపై వంద పేజీల స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. హాజరయ్యే వారు ఇతర వివరాలకు 8500644916, 7901048912 నెంబర్లను సంప్రదించాలని ఐవీ కోరారు.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అవసరం

కలెక్టర్ మాధవీలత.. బాలల దినోత్సవ సర్టిఫికెట్ల ప్రదానం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 3: పిల్లల ఆరోగ్యం, ఆర్యోకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించడం చాలా అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం జిల్లా కలెక్టరేట్‌లో నగదు బహుమతి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి గోపాలపురం అంబేడ్కర్ గురుకులం పదో తరగతి విద్యార్థిని ఎస్.అనూష, ద్వితీయ బహుమతి రాజమహేంద్రవరం ఎల్ఎంసీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని పి.అమృత, తృతీయ బహుమతి రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ఇంగ్లిషు మీడియం స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని జీవీ కావ్య గెలుచుకున్నారు. అలాగే వక్తృత్వ, చిత్రలేఖనం, పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిరోముండనం చేసిన భర్తకు రిమాండ్

సీతానగరం, ఫిబ్రవరి 3: భార్యకు శిరోముండనం చేసిన నిందితుడు కర్రి రాంబాబు అలియాస్ అభిరామ్‌కు కోర్టు రిమాండ్ విధించినట్టు సీఐ ఎ.నాగ మురళీ శనివారం తెలిపారు. భార్యాభర్తలకు మధ్య వచ్చిన మనస్పర్థల నేపథ్యంలో భార్యను చంపాలన్న ఉద్దేశ్యంతో అభిరామ్ తన తల్లిదండ్రులను బయటకు పంపించి ఎవరూ లేని సమయంలో ఇంటికి వచ్చి భార్య ఆశను ప్రేమతో లోపలికి తీసుకెళ్లి తనతో పాటు తీసుకొచ్చిన కత్తితో భార్యను బెదిరించి ట్రిమ్మర్ సహాయంతో గుండుగీసి చంపడానికి ప్రయత్నించాడు. చుట్టుపక్కల వారి సమాచారంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ పలు సెక్షన్లతో కేసు నమోదు చేసి నిందితుడిని శనివారం అరెస్టు చేసి రాజమహేంద్రవరం 7వ అదనపు మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చగా నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ మురళీ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న యాక్టివా.. ఒకరి మృతి

వాడపల్లి వెంకన్న దర్శనానికి వెళ్లొస్తుండగా ప్రమాదం

కొవ్వూరు, ఫిబ్రవరి 3: ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ పోలీసులు తెలిపారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఆవుల పుల్లారావు, కనకేశ్వరరావు అన్నదమ్ములు. గ్రామస్థులతో కలిసి శనివారం మోటారుసైకిళ్లపై కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి ఏడువారాల వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా బొబ్బర్లంక దాటిన తరువాత కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామ సమీపంలో యాక్టివా. మోటారుసైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ బైక్ పైనుంచి కింద పడిపోయారు. కనకేశ్వరరావు(27) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు పుల్లారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. కాగా కనకేశ్వరరావుకు భార్య 3 నెలల కుమార్తె ఉన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగాల ఎంపిక జాబితా విడుదల

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 3: రాజమహేంద్రవరం జోన్-2 ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుల పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీ / సీహెచ్‌వో పోస్టుల ఫైనల్ సెలక్షన్ జాబితాలు జోన్ పరిధిలోని అన్ని జిల్లాల వెబ్‌సైట్లలో ఉంచినట్టు ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ పి.పద్మా శశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయడానికి జనవరి 12న నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. ఎంపికైన అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని ఈనెల 5వ తేదీన ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుల కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.